ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత మంగళవారం గరిష్ఠం : 35.0 కనిష్ఠం : 25.0
ANDHRAJYOTHY
5

అనంతపురం
జిల్లా వార్తలు
బుధవారం 9 జూలై 2025

రామగిరి ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్

అనంతపురం న్యూటౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లాలోని రామగిరి ఎంపీపీ ఎన్నిక నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 12లోపు సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అనంతరం 16న ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎన్నిక నిర్వహించాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య తగిన చర్యలకు శ్రీకారం చుట్టారు.

కేసు ఉంది.. అరెస్టు చేస్తాం..!

ఎక్కడున్నారో చెబితే వస్తాం..!

- బెదరగొడుతున్న సైబర్ నేరగాళ్లు
- పోలీసుల పేరిట బెదిరింపు కాల్స్
- బురిడీ కొట్టించి.. రూ.లక్షల్లో దోపిడీ



హిందూపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): నకిలీ పోలీసులు ఆగడాలు మితిమీరిపోతున్నాయి. వారం రోజుల క్రితం హిందూపురం మండలానికి చెందిన రాజకీయ నాయకుడికి బెంగళూరు సిటీ నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. 'నేను రవిచంద్ర.. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతున్నాను.. మీరు ఎక్కడున్నారు, మీపై బెంగళూరు సిటీలోని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. ఎక్కడున్నారో చెబితే అక్కడికే వస్తాం' అని చెప్పారు. అంతటితో ఆగకుండా వీడియో కాల్ రిసీవ్ చేయమన్నారు. సదరు నాయకుడు వీడియోకాల్ రిసీవ్ చేయడంతో బెంగళూరు సిటీ పోలీస్ అనే బోర్డు కూడా కనిపించింది. వెంటనే తాను చెప్పినట్లు చేస్తే ఓకే లేదా మీరు ఉన్నచోటుకే వచ్చి తీసుకెళ్తామని హెచ్చరించారు. సదరు నాయకుడు మొదట కొంత గాబరాపడ్డాడు. కొద్దిసేపటికి తేరుకుని.. తనపై బెంగళూరులో ఏమి కేసు ఉందని ప్రశ్నించాడు. స్థానిక పోలీసులతో మాట్లాడి చెబుతా అన్నాడు. నకిలీ పోలీసని తెలుసుకుని ఆ నంబరుకు తిరిగి ఫోన్‌చేస్తే మొదట మాట్లాడారు. ఆ తరువాత స్విచ్‌ఆఫ్ చేసుకున్నారు.

- నెల క్రితం హిందూపురం పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లికి చెందిన ఓ ప్రముఖ చీరల వ్యాపారికి గోవా పోలీసులం మాట్లాడుతున్నామని కాల్ చేశారు. 'మీ కుమారుడు ఇక్కడికి వచ్చి డ్రగ్స్ కేసులో పట్టుబడ్డాడు. మేం చెప్పినట్లు చేస్తే వెంటనే వదిలేస్తాం.. లేదంటే మీ ఇష్టం' అన్నారు. చీరల వ్యాపారి కొడుకు తరచూ గోవాకు వెళ్లివచ్చేవాడు. దీంతో వెంటనే తన కుమారుడికి ఫోన్‌చేస్తే స్విచ్‌ఆఫ్ వచ్చింది. దీంతో ఫోన్‌చేసిన (మిగతా 6లో...)

ఏఐ మాస్టారు..!

- పాఠాలు చెబుతున్న కృత్రిమ గురువు
- విద్యాప్రమాణాలను పెంచుతున్న పాల్
- తొలివిడత 32 కేజీబీవీల్లో అమలు
- 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు బోధన

బడిలో గురువు పాఠం చెబుతారు. అర్థమైందా అని అడుగుతారు. హోం వర్క్ ఇస్తారు. పరీక్షలు పెడతారు. విద్యార్థుల భవిష్యత్తుపై కాస్త శ్రద్ధ ఉండేవారైతే.. ఎలా చదువుతున్నారో గమనిస్తారు. తప్పులు చేస్తే దండిస్తారు. అర్థం కాలేదు అంటే.. ఒకటికి రెండుసార్లు చెబుతారు. ఎంత మంచివారైనా.. ఏదో ఒక సమయంలో విసుక్కుంటారు. 'నిన్ను మార్చడం నావల్ల కాదు' అని చెప్పి వదిలేస్తారు. కానీ, కొత్త గురువుకు అలాంటి ఫీలింగ్స్ ఏమీ ఉండవు. పాఠం చెబుతుంది. ప్రశ్నలు వేస్తుంది. సమాధానం ఇవ్వగానే.. నువ్వేమిటో.. నీ సత్తా ఏమిటో ఇట్టే పసిగడుతుంది. తప్పు చేస్తే.. ఎక్కడ, ఎలా చేశావో విడమరిచి చెబుతుంది. ఆ తరువాత.. నీ స్థాయికి తగ్గ పాఠాలను మాత్రమే నీకు చెబుతుంది. నీ బుర్ర పదునెక్కే కొద్దీ.. సబ్జెక్ట్ స్థాయిని పెంచుతూ పోతుంది. ఆ మాస్టారి పేరు.. ఏఐ..! ఖరీదైన కార్పొరేట్ పాఠశాలల్లో ఇలా చెబుతుంటారులే అనుకోకండి. ఇది పక్కా లోకల్..! జిల్లాలోని 32 కేజీబీవీలలో బాలికలకు ఏఐ పాఠాలు చెబుతోంది. ఈ పద్ధతి పేరు పాల్..!



గుత్తి కేజీబీవీలో ఏర్పాటుచేసిన పాల్ ల్యాబ్

అనంతపురం విద్య, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో పర్సనలైజ్డ్ అడాప్టివ్ లర్నింగ్ (పాల్) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. గణితం, ఆగ్లం, తెలుగులో వెనుకబడిన విద్యార్థులకు విషయం అర్థమయ్యేలా బోధించడం ఇందులో భాగం. వ్యక్తిగతంగా శ్రద్ధ పెట్టి.. వారి స్థాయిలో విషయాన్ని (కంటెంట్) అర్థమయ్యేలా చెప్పడం, పై తరగతుల్లో పాఠాలను సులభంగా అర్థం చేసుకునేలా తీర్చిదిద్దడం వంటి కార్యక్రమాలను పాల్ కింద చేపడతారు. విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించి, అందుకు అనుగుణంగా వీడియో పాఠాలను ట్యాబ్‌లలో చూపిస్తారు. ఈ విధానాన్ని జిల్లాలోని 53 కేజీబీవీలు, ఏపీ మోడల్ స్కూల్స్‌లో ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. తొలి విడత 32 కేజీబీవీలలో ప్రవేశపెట్టారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకూ చదువుతున్న బాలికలలో సామర్థ్యాల పెంపునకు చర్యలు చేపట్టారు.

వ్యక్తిగత అనుకూల అభ్యాసం

విద్యార్థుల వ్యక్తిగత అనుకూల అభ్యాసం అందించడమే పాల్ లక్ష్యం. కృత్రిమ మేధస్సు (ఏఐ), డేటా విశ్లేషణ ద్వారా విద్యార్థి అభ్యసన స్థాయికి అవసరమైన డిజిటల్ కంటెంట్‌ను అందిస్తారు. విద్యార్థులు ఏ అంశాలలో వెనుకబడి ఉన్నారో గుర్తించి, వాటిని నేర్చుకోవడానికి పాల్ విధానాన్ని ఉపయోగిస్తారు. జిల్లాలో పాల్ అమలు చేస్తున్న 32 కేజీబీవీలలో 6 నుంచి 9వ తరగతి వరకూ ఒక్కో తరగతిలో 40 మంది



చొప్పున బాలికలు ఉన్నారు. వీరిలో ఆయా తరగతులకు ఉండాల్సిన సామర్థ్యాలకన్నా తక్కువ సామర్థ్యం ఉన్న బాలికలకు 'పాల్' ద్వారా పాఠాలు వినిపిస్తారు. దీనికోసం ఒక్కో కేజీబీవీకి 30 ల్యాబ్‌లను ప్రభుత్వం అందజేసింది. తరగతుల వారీగా గణితం, ఆగ్లం, తెలుగు పాఠాల కంటెంట్‌ను ట్యాబ్‌లలో అప్‌లోడ్ చేశారు.

అంతా ఏఐనే చూసుకుంటుంది..

ట్యాబ్‌లో ఉన్న పాఠాల కంటెంట్ మొత్తం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పని చేస్తుంది. తొలుత వీడియోలో పాఠం వస్తుంది. అనంతరం ఆ పాఠంపై కొన్ని ప్రశ్నలు వస్తాయి. ఆ సమయంలో వాటికి సమాధానం ఇచ్చిన విద్యార్థుల సామర్థ్యాన్ని ఏఐ అంచనా వేస్తుంది. వారి సామర్థ్యానికి తగిన వీడియో పాఠాలను తదుపరి ట్యాబ్‌లలో ఏఐ ప్రసారం చేస్తుంది. పరీక్షలలో జవాబులు తప్పుగా రాస్తే, ఎలా, ఎందుకు తప్పు చేశారో కూడా ఏఐ చెప్పేస్తుంది. వీడియోలో తప్పులను విశ్లేషిస్తుంది. ఆ విద్యార్థి.. చేసిన తప్పును తెలుసుకుని, సరిదిద్దుకునే అవకాశం ఉంటుంది. తద్వారా విద్యాప్రమాణాలు పెరుగుతాయి. ఆయా తరగతుల ఉపాధ్యాయులు వారానికి ఒకసారి ఈ పాఠాలను ఇంటర్నెట్‌తో అనుసంధానం చేస్తారు. తద్వారా ఆ డేటా మొత్తం రాష్ట్ర ఎస్పీడీ కార్యాలయానికి దానంతట అదే వెళుతుంది.

సామర్థ్యాలు పెరుగుతున్నాయి..



విద్యార్థులలో ప్రమాణాల పెంపునకు పర్సనలైజ్డ్ అడాప్టివ్ లర్నింగ్ కార్యక్రమాన్ని ఎస్ఎస్ఏ ద్వారా అమలు చేస్తున్నాం. జిల్లాలోని 53 పాఠశాలల్లో అమలు చేయాలని ఆదేశాలు వచ్చాయి. తొలివిడత 32 కేజీబీవీలలో పాల్ అమలవుతోంది. ఒక్కో కేజీబీవీకి 30 ట్యాబ్‌లు అందజేశాము. వాటి ద్వారా పాల్ కంటెంట్‌తో పాఠాలు నేర్పిస్తున్నాం. మిగతా పాఠశాలల విద్యార్థులకంటే పాల్ అమలు చేస్తున్న కేజీబీవీ విద్యార్థులలో బేసిక్ విద్యా ప్రమాణాలు, స్వయంగా అభ్యసించే సామర్థ్యం, డిజిటల్ అధ్యయన పద్ధతులు మెరుగ్గా ఉన్నట్లు నివేదికలు వచ్చాయి. త్వరలో మోడల్ స్కూల్స్‌లోనూ పాల్ అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. -శైలజ, ఏపీసీ, ఎస్ఎస్ఏ

కొడితే దిక్కెవరు..?

- రెచ్చిపోతున్న కాల్‌మనీ గ్యాంగ్‌లు
- గంజాయి మత్తులో తూగుతున్న యువత
- వన్‌టౌన్ పరిధిలో అసాంఘిక శక్తుల హల్‌చల్
- శాంతిభద్రతలు.. పోలీసు అధికారులకు పట్టవా..?

అనంతపురం క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): నగరంలో.. పట్టపగలే నడిరోడ్డుపై ముగ్గురు యువకులు ఒక వ్యక్తిపై దాడి చేశారు. వడ్డీకి తీసుకున్న డబ్బులు ఇవ్వలేదని చితకబాదారు. మారుమూల ప్రాంతంలో ఇలాంటి సంఘటన జరిగితే.. పోలీసుల భయం లేదులే అనుకోవచ్చు. కానీ జిల్లా కేంద్రంలోనే ఇలా వ్యవహరిస్తున్నారంటే శాంతిభద్రతల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. డబ్బులు ఇవ్వనందుకు భౌతిక దాడి చేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

శాంతిభద్రతలు పట్టవా..?

మొన్న గంజాయి బ్యాచ్ హల్‌చల్. నిన్న హిజ్రాల పరస్పర దాడులు. నేడు కాల్‌మనీ గ్యాంగ్ దాడి. ఇవి బయటకు వచ్చిన సంఘటనల్లో కొన్ని. అనంతపురం నగరంలో కీలకమైన వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న నేరాలు ఇవి. స్థానికులను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. జిల్లా కేంద్రంలో అసాంఘిక శక్తులను కట్టడి చేయడంపై పోలీసు యంత్రాంగం పెద్దగా దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. సుమారు నెల రోజులుగా వన్‌టౌన్ స్టేషన్‌కు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లేరు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సీఐని సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు.

కీలక స్టేషన్

అనంతపురంలో ఉన్న పోలీస్ స్టేషన్లలో వన్‌టౌన్ కీలకం. నగరంలో 50 డివిజన్లు ఉండగా.. 15 నుంచి 19 డివిజన్‌లు ఈ స్టేషన్ పరిధిలోనే ఉన్నాయి. భవానీ నగర్, రాణి నగర్, మున్నా నగర్, అంబర్ గేర్, వేణు గోపాల్ నగర్, సున్నపుగేరి, కలెక్టరేట్, మటన్ మార్కెట్, అంబేడ్కర్ నగర్, జేఎన్టీయూ, శారదా నగర్, గౌస్‌వారి స్ట్రీట్, బుడ్డప్ప నగర్, ఫ్రెరర్ కాలనీ, అశోక్ నగర్, బోయవీధి.. ఇలా చాలాప్రాంతాలు ఈ స్టేషన్ పరిధిలోకి వస్తాయి. ఇవన్నీ నగరంలో ప్రధాన వీధులు, కాలనీలు. శాంతి భద్రతల పరంగా సమస్యలు తలెత్తే ప్రాంతాలు ఈ స్టేషన్ పరిధిలో ఎక్కువ. ఈ స్టేషన్ పరిధిలో సుమారు 1.50 లక్షల మంది ఉన్నారు. కొన్ని కాలనీల్లో చిల్లర గొడవలు, దాడులు ఎక్కువగా జరుగుతుంటాయి. వైసీపీ నాయకుల ముసుగులో కొందరు కాల్‌మనీ వ్యవహారాలు నడిపిస్తున్నారు. కొందరు వడ్డీ వ్యాపారులు అధిక వడ్డీలకు డబ్బులిచ్చి.. సామాన్యులను జలగల్లా దోచేస్తున్నారు. వీరి దెబ్బకు చాలా కుటుంబాలు ఊరు విడిచాయి. ఇలాంటి ప్రాంతంపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాల్సిందిపోయి.. పట్టించుకోవడం మానేశారు.



పాతూరులో వ్యాపారిపై దాడి చేస్తున్న వడ్డీ వ్యాపారులు (ఫైల్)

ఒక్క సీఐ లేరా..?

ఇటీవల గంజాయి బ్యాచ్ వన్‌టౌన్ స్టేషన్ ఎదుటే రీల్స్ చేస్తూ హంగామా చేసింది. దమ్ముంటే పట్టుకోండి అన్నట్లు సవాల్ విసిరింది. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు.. వారిని పట్టుకుని చుక్కలు చూపించారు. యువత గంజాయి మత్తులో స్టేషన్ వద్దే హల్‌చల్ చేసే స్థాయికి రావడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల హిజ్రాలు సైతం రెండు వర్గాలుగా విడిపోయి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ సంఘటనలు మరువకముందే పట్టపగలే పాతూరులో నడిరోడ్డుపై వడ్డీ డబ్బులు కోసం దాడులు చేశారు. ఓ వ్యాపారిని ఏకంగా కాళ్లతో తన్నారు. ఏం చేసినా పోలీసులు పట్టించుకోరనే ధీమా అసాంఘిక శక్తుల్లో కనిపిస్తోంది. ఇప్పటికైనా డీఐజీ, ఎస్పీ స్పందించి, వన్‌టౌన్ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. నెల రోజులుగా ఖాళీగా ఉన్న సీఐ కుర్చీలోకి మంచి అధికారిని పంపాల్సిన అవసరం ఉంది.

కౌలు రైతులను మింగిన అప్పులు

- జిల్లాలో ఇద్దరు అన్నదాతల ఆత్మహత్య

గార్లదిన్నె/విడపనకల్లు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అప్పుల బాధతో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. విడపనకల్లు మండలం పాల్తూరుకు చెందిన గణేష్(20), గార్లదిన్నె మండలం కొప్పలకొండకు చెందిన ఓబులపతి(45) బలవన్మరణానికి పాల్పడ్డారు. యువ రైతు గణేష్.. తన తండ్రి వండ్రప్ప, తల్లి చిట్టెమ్మతో కలిసి మూడు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని మిరప సాగు చేసేవాడు. మూడేళ్ల నుంచి పంట నష్టం రావడంతో పెట్టుబడికి తెచ్చిన అప్పులు రూ.8 లక్షలు వడ్డీతో కలిపి రూ.10 లక్షలు దాటాయి. అప్పుల గురించి సోమవారం రాత్రి చర్చించుకున్నారు. దిక్కుతోచడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేయడంతో, రాత్రి వారు నిద్రించిన తరువాత గణేష్ ఉరి వేసుకున్నాడు. తల్లిదండ్రులు మంగళవారం ఉదయం గమనించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పాల్తూరు ఎస్ఐ మురహరి తెలిపారు. కొప్పలకొండకు చెందిన ఓబులపతి, పార్వతి దంపతులకు ఎకరం పొలం ఉంది. మరో నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకుని వరిసాగు చేసేవారు. గిట్టుబాటు ధర లభించక తీవ్రంగా నష్టపోయారు. అప్పులు రూ.8 లక్షలు పేరుకుపోయాయి. ఒత్తిడి తాళలేక ఈ నెల 5న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓబులపతి పురుగుల మందు తాగాడు. అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆయనకు కుమారుడు, కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మహమ్మద్ గౌస్ బాషా తెలిపారు.



గణేష్(ఫైల్)



ఓబులపతి(ఫైల్)

రాయలసీమకు
సామాజిక న్యాయం చేయాలి

మానవ హక్కుల వేదిక రాష్ట్ర నేత ఎస్ఎం బాషా (7లో...)

వ్వా..నరుడు
- కోతి ప్రాణం నిలిపిన యువకులు 6

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు
- రూ.12 లక్షల విలువైన ఆభరణాల స్వాధీనం 7

అప్పు చెల్లించమన్నందుకే హత్య
మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు

గురుకుల పాఠశాల విద్యార్థినికి గాయాలు



అనంతపురం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక

గుత్తి రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): రజాపురం సమీపంలోని గిరిజన గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థిని మైథిలి తీవ్రంగా గాయపడింది. పుట్లూరు మండలం సూరేపల్లికి చెందిన చిన్న కుళ్ళాయప్ప, వరలక్ష్మి దంపతుల కూతురు మైథిలి. పాఠశాలలో భోజన విరామ సమయంలో, సోమవారం మధ్యాహ్నం పరిగెడుతూ బాలిక కింద పడిందని అంటున్నారు. ఎముకలు పలుచోట్ల విరగడంతో ఘటనపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ వెంకటేశ్వర్లు మంగళవారం గురుకుల పాఠశాలకు వెళ్లి విచారించారు. డైనింగ్ టేబుల్ తట్టుకుని కింద పడిందని, బాలికను వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని పోలీసులు తెలిపారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెగా హిట్‌కు ఏర్పాట్లు

- ప్రతిష్ఠాత్మకంగా మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్
- రాష్ట్రశాఖ నుంచే తల్లిదండ్రులను ఆహ్వానిస్తూ మెసేజ్‌లు
- జిల్లాస్థాయిలో విజయవంతానికి యంత్రాంగం కుస్తీ

అనంతపురం విద్య, జూలై 8(ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్(పీటీఎం)ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల పదో తేదీన ఈ పీటీఎంను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారయంత్రాంగం మొత్తం మెగా పీటీఎంపైనే దృష్టి సారించి పని చేస్తున్నారు. రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం నుంచే విద్యార్థుల తల్లిదండ్రులను 'పేరెంట్స్ మీటింగ్ 10న నిర్వహిస్తున్నాం, మీరు తప్పకుండా రండి, ఇదే మాఆహ్వానం' అంటూ ప్రభుత్వం తరపున వారి ఫోన్లకు మెస్సేజ్‌లు పంపుతూ ఆహ్వానిస్తున్నారు. మరోవైపు జిల్లాలోను 1739 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, 676 ప్రైవేట్ స్కూల్స్, 28 ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు, 68 ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్ టచర్స్ మీటింగ్ నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కలెక్టరు వినోద్‌కుమార్, డీఈఓ ప్రసాద్‌బాబు, ఏపీసీ శైలజ, ఇంటర్మీడియట్ అదికారి వెంకటరమణనాయక్‌లతో పాటు అన్నిశాఖల అధికారులు పీటీఎం నిర్వహణపైనే దృష్టి సారించి, ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. జిల్లా స్థాయి నుంచి పాఠశాలల స్థాయి వరకు వివిధ కమిటీలు ఏర్పాటు చేసి వారికి బాధ్యతలు అప్పగించారు. గతంలో మాదిరి కాకుండా ఈసారి తల్లిదండ్రులకు పోటీలు, తల్లిపేరుతో ప్రతివిద్యార్థి మొక్కనాటడం, తల్లిదండ్రులతో కలిసి ప్రతి విద్యార్థి ప్రత్యేకంగా ఫొటో , వేడుకలకు సంబంధించి ప్రతిపాఠశాలలోను 3నిమిషాలు తప్పనిసరిగా వీడియో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈమేరకు అన్నిపాఠశాలలో ఏర్పాట్లకు అధికారులు ఆదేశాలు ఇచ్చారు. దీంతో హెచ్‌ఎంలు, టీచర్లు మెగా పీటీఎం నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేపడుతూ సన్నద్ధమవుతున్నారు. ఫొటోలు తీయడానికి ప్రత్యేకంగా బూత్ ఏర్పాటు చేశారు. మీటింగ్‌కు హాజరయ్యే తల్లిదండ్రులు, ముఖ్యఅతిథులను ఆహ్వానించేందుకు విద్యార్థుల చేత డ్రమ్స్, వాయిద్యాలు వాయించడం తర్ఫీదు ఇస్తున్నారు. ఇపుడు ఏ టీచర్‌ను పలకరించినా పీటీఎంపై మాట్లాడుతున్నారు.



Yesterday • 9:38 PM

మహాశయా, తేదీ 10-7-2025 న ఉ.9 గంటలకు మన పాఠశాలలో మెగాPTM 2.0 (తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశము) నిర్వహిస్తున్నాము. కావున తప్పనిసరిగా హాజరు కావాలని ఆహ్వానిస్తున్నాము. కార్యక్రమాల వివరాలను ఈ లింక్ ద్వారా పొందగలరు. https://cse.ap.gov.in/GeneratePTMPDF?scid=28222400701 -SE-GOVTAP

మెగా పీటీఎంకు ఆహ్వానిస్తూ తల్లిదండ్రులకు పంపిన మెసేజ్



తల్లిదండ్రులు, అతిథులను ఆహ్వానించేందుకు డ్రమ్స్‌తో రిహార్సల్స్ చేస్తున్న బీకేఎస్ హైస్కూల్ విద్యార్థులు

కారు బోల్తా.. ముగ్గురి మృతి

- ఒకరికి తీవ్ర గాయాలు.. 'అనంత'లో ఘటన
- మృతులు మహారాష్ట్రలోని శివగావ్ వాసులు

(వివరాలు మెయిన్‌లో..)



కురవని మేఘం..!

- కారుమబ్బుల దోబూచులాట
- నేలరాలని చినుకు
- అన్నదాతల్లో ఆందోళన
- అదును దాటుతోందని భయం



చిలమత్తూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఆకాశంలో కమ్ముకుంటున్న మేఘాలు కరుణించకపోవడంతో రైతులకు నిరాశే మిగులుతోంది. కారుమబ్బుల మేఘాలు రైతన్నలను మురిపిస్తున్నాయి. మే నెలాఖరులో మోస్తరు వర్షాలు కురవడంతో రైతన్నల్లో సంతోషం వెల్లివెరిసింది. జూన్‌లో వరుణుడు ముఖం చాటేశాడు. జూలైలో వారం రోజులు గడిచినా చినుకు రాలకపోవడంతో ఈసారి ఇంతేనా అంటూ రైతుల్లో నిరాశ నెలకొంటోంది. మృగశిర కార్తెలో కురిసిన వర్షంతో పొలాలను ఖరీఫ్ సాగుకు సిద్ధం చేసుకున్నారు. కొందరు తొలకరి వర్షాలకు వేరుశనగ, మొక్కజొన్న పంటలను విత్తుకున్నారు. అప్పటి నుంచి చినుక నేల రాలకపోవడంతో మొలకెత్తిన పంటలు వాడుముఖం పడుతున్నాయి.

దోబూచులాట

రాష్ట్రంలో అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నా జిల్లాలో మాత్రం నెల రోజులుగా వరుణ దేవుడు కరుణించలేదు. కారుమబ్బులు దోబూచులాడుతూ రైతుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. రోజూ భారీ వర్షం కురుస్తుందేమో అన్నట్లుగా ఆకాశం మేఘావృతమవుతోంది. కాసేపటికే ఉసూరుమంటున్నాయి. తుంపర్లు కూడా పడకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు.

ఆకాశం వైపు చూపు

కారుమబ్బులతో రైతులను మభ్యపెడుతున్న వాన మేఘాలు చినుకు రాల్చకుండా దూసుకుపోతుండటంతో రైతులు ఆకాశం వైపు చూస్తూ ఉండిపోతున్నారు. ఎప్పుడు వాన కురుస్తుంది? ఎప్పుడు (మిగతా 6లో...)



టి.కొత్తపల్లిలో మామిడి మొక్క నాటుతున్న డ్వామా పీడీ సలీమ్ బాషా

రికార్డు స్థాయిలో..

ఒక్క రోజులో 1,34,593 ఉద్యాన మొక్కలు నాటేశారు

అనంతపురం అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఒక్క రోజులోనే రికార్డుస్థాయిలో 134593 ఉద్యాన మొక్కలు నాటారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ వినోద్‌కుమార్ నేతృత్వంలో డ్వామా పీడీ సలీమ్ బాషా పర్యవేక్షణలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. డ్రైలాండ్ హార్టికల్చర్ పథకం ద్వారా 2021 ఎకరాల్లో 134593 ఉద్యాన (మామిడి, చీనీ, సపోట, జామ) మొక్కలు నాటారు. డ్వామా పీడీ సలీమ్ బాషా ఆత్మకూరు మండలం టి.కొత్తపల్లిలో ఉద్యాన మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆయన మామిడి మొక్కలు నాటి, నీరు పోశారు. డ్రైలాండ్ హార్టికల్చర్ పథకాన్ని అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



పూ వలస..!


చెరువు నీటిలో
హాయిగా పెరుగుతుంటే..
పూసీ పుయ్యంగానే కోసి..
నిర్దయగా అమ్మేస్తున్నారు..!
అందమైన కమలపు జీవితం..
అర్ధాంతరంగా ముగియాల్సిందేనా..?
ఓ వెన్నెల రాతిరి మాట్లాడుకున్నాం..!
మరువ నీటిలో మెల్లగా ఈదుతూ..
గుట్టుగా ఈ గుంతకు చేరాం..!
పెంచుకున్న ఈ పూల బంధాన్ని
ఇక్కడా తెంచేస్తారా..?
వదిలేయండి మమ్మల్నిలా..
స్వేచ్ఛగా!

(ఎక్కడో చెప్పం.. వెతికి కోసుకుంటేనూ..)

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి







మిరపా.. వద్దులే..!

పంట సాగుకు ఆసక్తి చూపని రైతులు

- అరకొర దిగుబడులు, ధరలతో తీవ్ర నష్టం
- ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గు

మొక్కజొన్న సాగు చేశా



నేను ప్రతీ ఏటా 15 ఎకరాల్లో మిరప సాగు చేసేవాడిని. గత ఏడాది 8 ఎకరాల్లో మిరప పంట పూర్తిగా దెబ్బతినింది. మిగిన 7 ఎకరాల్లో అంతో ఇంతో దిగుబడి వచ్చి పెట్టుబడి తిరిగి వస్తుంది అనుకున్నాను. అలా జరగక తీవ్రంగా నష్టం వచ్చింది. ఈ సారి కూడా 10 ఎకరాల్లో డబ్బీ రకం మిరప సాగు చేయాలని అనుకున్నా. మిరప పంటకు పెట్టు బడులు ఎక్కువ, ధరలు మాత్రం ఉండవు. ప్రతీ సారి అప్పుల్లోనే కూరుకుపోవాల్సి వస్తోంది. అందుకే ఈసారి మొత్తం మొక్క జొన్న పంట సాగు చేశా.

-బొజ్జప్ప, రైతు, చీకలగురికి

విడపనకల్లు, జూలై 8(ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధర లేక నష్టాలు వస్తుండటంతో ఈ ఏడాది మండల రైతులు మిరప సాగువైపు మొగ్గు చూపడం లేదు. గత ఏడాది ఉరవకొండ నియోజకవర్గంలో దాదాపుగా 40వేల ఎకరాల్లో మిరప సాగు చేశారు. ఈ ఏడాది కనీసం 30వేల ఎకరాల్లో అయినా సాగు చేస్తారా అనే సందేహం కలుగుతోంది. మండలంలో మిరప రైతుల సందడి ఎక్కడా కనిపించటం లేదు. గత ఏడాది ఒక క్వింటా డబ్బీ రకం విత్తనం రూ.70వేలు, కడ్డీ రకం విత్తనం రూ.65వేలు ప్రకారం కొనుగోలు చేశారు. ఈసారి క్వింటా రూ. 20వేలు, రూ.30వేలకు కూడా కొనటం లేదని వివిధ ప్రాంతాల్లో విత్తన దుకాణాల యజమానులు చెబుతున్నారు. కొందరు రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తున్నారు.



సిద్ధం చేసుకున్న మిరప విత్తనాలు

నల్లతామరకు ఎదురు నిలిచి...

గత ఏడాది మిరప రైతులను నల్ల తామర పురుగు నిలువునా ముంచేసింది. కాయలు ఎర్ర బారుతున్న సమయంలో నల్లి పురుగు సోకింది. అధిక వర్షాలు కురువటం వల్ల నల్లిపురుగు సోకి కాయలు, పూత కుళ్లి పోయి దిగుబడి పడిపోయింది. అయినా రైతులు పంటలను కాపాడుకుని ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడిని సాధించారు. పండించిన పంటకు గిట్టు బాటు ధర లేకపోవటంతో కర్నాటకలోని బ్యాడిగి, హుబ్లీ, బళ్లారి, విడపనకల్లు, గుంతకల్లు వంటి ప్రాంతాల్లోని ఏసీ గోడౌన్‌ల్లో నిల్వ చేశారు. కొంతమంది రైతులు 2023, 2024 రెండు సంవత్సరాల పంటను అలాగే ఉంచారు. గిట్టుబాటు ధరల కోసం ఎదురు చూసి పండించిన పంటలను ఏసీ గోడౌన్‌లోనే వదిలేశారు.

మిరప మిషన్లకు తగ్గిన గిరాకీ

గత ఏడాది విత్తనాల కోసం రోజు 100 నుంచి 150 బస్తాలు మిరప కాయలను మిషన్లకు వేసేవారు. దీనికి కారణం రైతులు మిరప సాగుకు మొగ్గు చూపటం. ఈ ఏడాది జూలైలో ఓ వారం గడిచినా మిరప విత్తనాల కోసం రైతులు రాక పోవటంతో విత్తన సాగు అంతంత మాత్రమే అనిపిస్తోంది. ప్రస్తుతం రోజుకు ఒక మిషన్‌కు 20 నుంచి 30 బస్తాలు కూడా ఆడించటం లేదు.



ఏసీ గోడౌన్‌లో నిలువ ఉన్న మిరప పంట

మిరప రకాలు... దిగుబడులు

మిరప రకాన్ని బట్టి దిగుబడులు ఉంటాయి. సింజెంటా బ్యాడిగి రకం ఎకరాకు 22 నుంచి 26 క్వింటాళ్లు, గుంటూరు నాటీ వెరైటీ ఎల్‌సీ రకం 28 నుంచి 31 క్వింటాళ్లు, బీఎస్ఎఫ్ ఆర్మూర్ రకం 30 నుంచి 40 క్వింటాళ్లు, డబ్బి రకం ఎకరాకు 25 నుంచి 30క్వింటాళ్లు, గుంటూరు కారం కడ్డీ రకం 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయి.

నాలుగు ఎకరాల్లో చాలనుకున్నా



నేను ప్రతి సంవ త్సరం 12 ఎకరాల్లో మిరప సాగు చేసేవాడిని. గత ఏడాది దిగుబడి, గిట్టుబాటు ధరలు లేక చాలా నష్టపోయా. ఎకరాకు రూ. 10 వేల నుంచి 12వేలు విత్తనం ఖర్చు అవుతుంది. పెట్టు బడులు రూ. లక్షల్లోనే వస్తు న్నాయి. దిగుబడి ఉన్నా గిట్టుబాటు ధరలు రావు. ప్రతీ ఏటా రూ. లక్షల్లో అప్పులు పాల వుతున్నా. అందుకే ఈ ఏడాది నాలుగు ఎకరాల్లోనే మిరప సాగు చేయాలనుకుంటున్నా.

-పురుషోత్తం, రైతు, ఆర్ కొట్టాల

కేసు ఉంది.. అరెస్టు చేస్తాం..!

(5వ పేజీ తరువాయి)



నకిలీ పోలీసులకు రూ.2లక్షలు నగదును బదిలీ చేశాడు. కొద్ది సేపటి తరువాత కుమారుడి ఫోన్ ఆన్‌కావడంతో ఎక్కడున్నావని ఆరాతీయగా.. తాను బెంగళూరులో ఉన్నానని చెప్పాడు. ఫోన్‌చేసినది నకిలీ పోలీసులని తెలుసుకుని మిన్నకుండిపోయారు.

- రెండు నెలల క్రితం పట్టణంలోని డీఆర్ కాలనీలో నివాసమున్న ఓ రియల్టర్‌కు ఫోన్‌కాల్ వచ్చింది. 'మీ కుమార్తె బెంగళూరులో పబ్బుకు వెళ్లి పోలీసులకు పట్టుబడింది. మేం చెప్పినట్లు వింటే వదిలేస్తాం' అని చెప్పారు. నిజమేననుకుని రియల్టర్ రూ.50వేలు బదిలీ చేశాడు. తరువాత అది చాలదంటూ మరింత వేయమని డిమాండ్ చేశారు. దీంతో తండ్రి గాబరాపడి కుమార్తెను ఆరాతీయగా తాను కళాశాలలోనే ఉన్నానని చెప్పడంతో ఆ రియల్టర్ మోసపోయానని స్థానిక పోలీసులవద్ద వాపోయాడు.
- పై ముగ్గురేకాదు ఆరు నెలల వ్యవధిలో హిందూపురం పట్టణంలో 50మందికి పైగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తే భారీ లాభాలు వస్తాయని, టాస్క్ పూర్తిచేస్తే లక్షల్లో లాభాలు చూడవచ్చని నిలువునా మోసం చేసిన నేరగాళ్లు ఇటీవల రూటుమార్చి నకిలీ పోలీసుల అవతారమెత్తారు. మీపేరుపై డ్రగ్స్, మత్తుపదార్థాలు వచ్చాయంటూ బెదిరించి అరెస్ట్ చేస్తామని డబ్బులు దోచేస్తున్నారు.

ఫోన్‌లోనే సెటిల్‌మెంట్

బాధితుల్లో ఎక్కువగా ప్రభుత్వ, ప్రైవేట్, విశ్రాంత ఉద్యోగులు, అధ్యాపకులు, వైద్యులు, వ్యాపారాలు చేసే ఉన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో నేరగాళ్లు వల విసురుతున్నారు. బాధితుల సెల్‌ఫోన్‌లను హ్యాక్‌చేసి వాటిలోని సమాచారాన్ని తస్కరిస్తున్నారు. ఆ తరువాత ఫోన్‌చేసి తాము ముంబాయి, ఢిల్లీ, చెన్నై, గోవా, హైదరాబాద్, కలకత్తా పోలీసులమంటూ నమ్మబలుకుతున్నారు. మీ పేరుపై డ్రగ్స్ పార్శిల్ వచ్చిందని విమానాశ్రయాల్లో రైల్వే స్టేషన్‌లు, బస్టాండులో పట్టుకున్నామని బెదిరించి అరెస్ట్ చేయడానికి వస్తున్నామంటూ హెచ్చరించి సాధ్యమైనంత దోచేస్తున్నారు. అరెస్ట్ ఆపాలంటే కొంతమొత్తం అధికారులకు ఇవ్వాల్సి ఉంటుందని, తన ఖాతాకు వెంటనే జమచేయాలని చెప్పి ఆన్‌లైన్ ద్వారావేయించుకుంటున్నారు.

ముఖ్య నాయకులకే బెదిరింపు కాల్స్

కొంతకాలం వరకు సైబర్ నేరగాళ్లు అమాయకులపైనే వల విసిరారు. ఇప్పుడు ఏకంగా ప్రముఖంగా వినిపించే వ్యక్తులపైనే గురి పెడుతున్నారు. ఇటీవల హిందూపురంలో నకిలీ పోలీసులు చేసిన ఫోన్‌కాల్స్‌ను బట్టి చూస్తే కొంతమంది రియల్టర్లు మరికొందరు పేరుమోసినవారు ఉండటం ఆందోళన కలిగించే విషయం. మరికొంతమంది సైబర్ నేరగాళ్లబారిన పడి మోసపోయినా చెప్పలేక మదనపడుతున్నారు. దీంతో ఆన్‌లైన్‌లో సైబర్ నేరగాళ్లు విసురుతున్న వలకు చిక్కి లక్షల్లో పోగొట్టుకుంటున్నారు.

ఫోన్‌కాల్స్‌ను నమ్మకండి



సైబర్ నేరగాళ్లు పోలీసులమని బెదిరించి మోసగిస్తున్న ఉదంతాలపై కొంతమంది మాకు చెబుతున్నారు. కానీ లిఖితపూర్వకంగా ఫిర్యాదులు ఇవ్వలేదు. ఇస్తే ఆ నకిలీ పోలీసులపై చర్యలు తీసుకునేందుకు ఆస్కారం ఉంటుంది. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. నిజమైన పోలీసులు ఎప్పుడూ అరెస్ట్ చేస్తామని బెదిరించరు. ఆన్‌లైన్‌లో సంప్రదింపులు చేయరు. అలాంటి ఫోన్‌కాల్స్ వస్తే నమ్మి మోసపోకండి. ఎవరైనా మెసేజ్‌లుపెట్టినా, ఫోన్‌లు చేసినా పోలీసులను సంప్రదించండి.

- మహేష్, డీఎస్పీ, హిందూపురం

విలువలపై వేసవి తరగతులు



భగవాన్ మిషన్ వాల్యూషన్ లోగోను విడుదల చేస్తున్న ట్రస్టు సభ్యులు రత్నాకర్, చక్రవర్తి

పుట్టపర్తి, జూలై 8(ఆంధ్రజ్యోతి): సత్యసాయి విద్యార్థులకు రెండో రోజు మంగళవారం విలువలపై వేసవి తరగతులను నిర్వహించారు. సాయికుల్వంతు సభామండపంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ విశాల్‌రావు సత్యసాయి బోధనాతత్వం, ప్రేమతత్వంపై ప్రసంగించారు. సత్యసాయి మిషన్ ఆఫ్ వాల్యూషన్ లోగోను శ్రీసత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్‌ట్రస్టీ ఆర్ జేరత్నాకర్, సభ్యులు చక్రవర్తి, సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్ పాండే, యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ రాఘవేంద్రతో కలిసి ఆవిష్కరించారు. సత్యసాయి సేవలు, విలువలపై బుక్‌లెట్‌ను విడుదల చేశారు. అనంతపురం మహిళా క్యాంపస్ ఏర్పాటుచేసి 54 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కళాశాల విద్యార్థినులు భక్తి నివేదనం పేరిట భక్తిపాటలు ఆలపించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



పాటలు పాడుతున్న విద్యార్థినులు

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు: ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్, జూలై8(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా పర్యటనకు పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ రత్న తెలిపారు. కొత్తచెరువు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఈనెల 10న మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ (పీటీఎం)కు ముఖ్యమంత్రి రానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను మంగళవారం ముఖ్యమంత్రి భద్రతాధికారులతో కలిసి ఎస్పీ పరిశీలించారు. శ్రీసత్యసాయి విమానాశ్రయం నుంచి కాన్వాయ్ వెళ్లే మార్గం, సభావేదిక, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. అక్కడ తసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు విజయ్‌కుమార్, నర్సింగప్ప, హేమంత్‌కుమార్, శివనారాయణస్వామి, శ్రీనివాసులు, ఎస్పీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లించినట్లు జిల్లా పోలీసులు తెలిపింది. ధర్మవరం వైపు నుంచి వచ్చే వాహనాలు మైలసముద్రం, నారేపల్లి, బుచ్చయ్యగారిపల్లి, కర్ణాటక నాగేపల్లి మీదుగా పుట్టపర్తికి రావాలన్నారు. పెనుకొండ వైపు నుంచి వచ్చే వాహనాలు సాయినగర్ క్రాస్‌నుంచి జగరాజుపల్లి, జగరాజుపల్లి క్రాస్, బడేనాయక్‌తాండా, బీడుపల్లి, బ్రాహ్మణపల్లి, గణేష్‌సర్కిల్, చిత్రావతి బైపాస్, గోరంట్ల వైపు నుంచి వచ్చే వాహనాలు జగరాజుపల్లి, జగరాజుపల్లి క్రాస్, బడేనాయక్‌తాండా, బీడుపల్లి, బ్రాహ్మణపల్లి, గణేష్‌సర్కిల్, చిత్రావతి బైపాస్, కర్ణాటకనాగేపల్లి, ముదిగుబ్బ వైపు నుంచి వచ్చే వాహనాలు నాగానందపల్లి, జానకంపల్లి, కర్ణాటకనాగేపల్లి వైపు వెళ్లాలన్నారు. కదిరి వైపు నుండి వచ్చే వాహనాలు తాత్కాలికంగా కర్ణాటకనాగేపల్లి బ్రిడ్జి వద్ద పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. వాహనదారులు గమనించాలని కోరారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ ముఖ్యమంత్రి భద్రతాధికారులు

నీరు అడిగి.. చైన్ లాగేశాడు..



బాధితురాలు పద్మావతమ్మ

అనంతపురం క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): తాగడానికి నీరు అడిగి వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు లాగేశాడు దుండగుడు. అనంతపురం రూరల్ మండలంలోని నందమూరినగర్‌లో మంగళవారం మధ్యాహ్నం పద్మావతమ్మ(60) మెడలోని చైన్‌ను దుండగుగు లాక్కెళ్లాడు. పద్మావతమ్మ, ఆమె భర్త రమణయ్య చిన్న కొట్టు నడుపుకుంటున్నారు. మంగళవారం మధ్యాహ్నం 2.50 గంటల ప్రాంతంలో ఓ దుండగుడు వచ్చి తాగడానికి నీరు ఇవ్వమని ఆమెను అడిగాడు. ఆమె నీరు తీసుకొచ్చేందుకు ఇంట్లోకి వెళ్తుండగా దుండగుడు వెనుక వైపు నుంచి ఆమె మెడలోని రెండున్నర తులాల గొలుసు లాక్కుని పరారయ్యాడు. ఆమె తేరుకుని, కేకలు వేసేలోగా...దుండగుడు పరారయ్యాడు. రూరల్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేశారు.

ప్రమాదంపై కేసు నమోదు

అనంతపురం క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంపై ట్రాఫిక్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ధర్మవరానికి చెందిన ఈశ్వరయ్య(54)ను సోమ వారం రాత్రి ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన విషయం తెలిసిందే. దీనిపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఢీకొట్టిన వాహనం ప్రైవేటు ఫైనాన్స్‌లో ఉన్నట్లు తెలిసింది. ఢీకొట్టిన వ్యక్తి, వాహన యజమాని వేర్వేరా.. ఇద్దరూ ఒక్కరేనా అనే కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు.

వావ్..నరుడు



కోతి ప్రాణాలు కాపాడుతున్న యువకులు

- కోతి ప్రాణం నిలిపిన యువకులు

పోతున్న ప్రాణాన్ని తమ సపర్యలతో నిలిపి మానవత్వాన్ని చాటారు సోమందేపల్లికి చెందిన యువకులు. మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు పక్కన కంచె లేకుండా ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఓ కోతి మంగళవారం విద్యుదాఘాతానికి గురైంది. అపస్మారక స్థితిలో కింద పడి ఉన్న వానరాన్ని స్థానిక యువకులు గుర్తించారు. వెంటనే దానిపై నీళ్లు పోశారు. అయినా చలనం లేకపోవడంతో మనుషులకు చేసినట్లు దానికి సీపీఆర్ చేశారు. దీంతో ఆ మూగజీవిలో కాస్త చలనం వచ్చింది. కొద్ది సేపటి తర్వాత దానికి కాసిన్ని నీళ్లు తాపారు. ఒళ్లంతా చేతులతో నిమిరారు. కాస్త కోలుకున్న తర్వాత దానికి కొన్ని పండ్లు ఇచ్చారు. యువకుల సపర్యలు, ఆహారంతో శక్తి కూడదీసుకున్న ఆ మర్కటం స్థానికులకు కళ్లతోనే కృతజ్ఞతలు చెబుతున్నట్లుగా చూస్తూ, మెల్లగా చెట్టు కొమ్మలపైకి వెళ్లిపోయింది. -సోమందేపల్లి, ఆంధ్రజ్యోతి

కురవని మేఘం..!

(5వ పేజీ తరువాయి)

విత్తనాలు విత్తుకుంటాం? అనే చింతలో ఉండిపోతున్నారు. ఇప్పటికే మే నెలలో కురిసిన ఓ మోస్తరు వర్షానికి పొలాలను దుక్కి చేసుకుని, విత్తనాలు విత్తేందుకు సిద్ధంగా ఉన్నారు. వర్షం కోసం ఎదురుచూసి కళ్లు కాయలు కాస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గాలులతో నీరసిస్తున్న మొలకలు

ఇప్పటికే అడపాదడపా కురిసిన తుంపర్లకు విత్తుకున్న వేరుశనగ, మొక్కజొన్న పంటలు మొలకెత్తాయి. అవి విత్తినప్పటి నుంచి వర్షం లేక పోవడంతో మొలకలు నీరసించిపోయాయి. ఇలాగే వారంరోజుల పాటు వర్షాభావ పరిస్థితులు కొనసాగితే మొలకలు మిగలవని రైతులు పేర్కొంటున్నారు. ఆషాఢం గాలులు విపరీతంగా వీస్తున్నాయి. గాలులకు మొలకెత్తిన పంటలు సైతం ఎండిపోతున్నాయి. వర్షం కురిసే మేఘాలను సైతం ఈ గాలులు ప్రభావితం చేసి కరిగిపోయేలా చేస్తున్నాయి. దాంతో గాలుల వేగం తగ్గేవరకు వర్షం కురిసే అవకాశం లేదంటున్నారు రైతులు.



వర్షం లేక ఎండుతున్న మొక్కజొన్న

మిగిలింది వారమే..

ఖరీఫ్‌లో పంటలు సాగు చేయాలంటే జూన్, జూలై నెలలు అదును. అందులో కూడా జూన్ నెలలో విత్తుకున్న పంటలే కొంత వరకు అధిక దిగుబడి ఇస్తాయి. జూలై 15 వరకు కూడా కొంత వరకు వేరుశనగ, మొక్కజొన్న పంటలకు సానుకూలమే. ఇప్పటికే జూలై నెలలో వారం రోజులు గడిచిపోయాయి. మిగిలింది వారమే. ఈలోగా వర్షం రాకపోతే ఆ తరువాత పంటలు విత్తుకున్నా ఫలితం ఉండదని రైతులు అభిప్రాయపడుతున్నారు.

అదునులో విత్తుకుంటేనే పంట దిగుబడి



ఖరీఫ్‌లో వర్షాధారంగా అదునులో విత్తుకుంటేనే పంట దిగుబడి ఉంటుంది. సాధారణంగా జూన్, జూలై మొదటి వారంలో విత్తుకుంటే పంటలు చేతికందుతాయి. ఈ ఏడాది జూన్ నెల పూర్తిగా వర్షం లేదు. ఈ నెలలో కూడా విపరీతమైన గాలులు ఉంటున్నాయి తప్ప.. వర్షం లేదు. దాంతో ఇప్పటి వరకు పంటలను విత్తుకోలేకపోతున్నాం. ఇప్పుడైనా వర్షం కురిస్తే కొంతవరకు మేలు చేకూరుతుంది.

- నరేంద్ర, రైతు, బందేపల్లి

వర్షం కోసం ఎదురుచూస్తున్నాం



నెల రోజులుగా ఈదురుగాలులు తప్ప.. చినుకు రాలలేదు. మబ్బులు కమ్ముకుంటూ రోజూ వర్షం వచ్చే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వానరాలేదు. వర్షాధారంగా మెట్ట భూముల్లో విత్తుకున్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. విత్తనాలు మొలకెత్తి నీరసంగా వాడిపోతున్నాయి. ఇప్పటికైనా వర్షం వస్తే కొంతవరకు గట్టెక్కగలం. లేదంటే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది.

- నందకుమార్, రైతు, దేమకేతేపల్లి

నేటి సమ్మెను జయప్రదం చేయండి

సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్



మాట్లాడుతున్న సీపీఐ జిల్లాకార్యదర్శి జాఫర్

అనంతపురం విద్య, జూలై 8(ఆంధ్రజ్యోతి): కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ బుధవారం నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రం 44 కార్మిక చట్టాలను కాలరాస్తూ కార్మిక వ్యతిరేక విధానాలను తీసుకొస్తోందన్నారు. ఈవ్యతిరేక చట్టాలను బీజేపీ పాలిత రాష్ట్రాలలో అమలు చేయకుండా ఇతర రాష్ట్రాలపై బలవంతంగా రుద్దేందుకు చూస్తోందని మండిపడ్డారు. కార్మికులకు పనివేళలు పెంచడం సరికాదని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, నల్లచట్టాల రద్దు, నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలని, తదితర డిమాండ్లతో చేపడుతున్న సార్వత్రిక సమ్మెకు అన్నివర్గాల ప్రజలు మద్దతు పలికి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నారాయణస్వామి, కేశవరెడ్డి, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

పాయసం తిని పలువురికి అస్వస్థత



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

ఓబుళదేవరచెరువు, జూలై8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకుతోటపల్లిలో దేవుడికి నైవేద్యంగా సమర్పించిన పాయసం తిని 15మంది మంగళవారం అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు తెలిపిన మేరకు తొలి ఏకాదశి సందర్భంగా ఆకుతోటపల్లికి చెందిన బాలకృష్ణ ఇంటిలో పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా దేవుడికి నేవైద్యంగా పెట్టిన పాయసాన్ని సోమవారం సాయంత్రం పూజలు, భజనకు వెళ్లి భక్తులు తిన్నారు. అప్పటి నుంచి వాంతులు, విరేచనాలతో బాధపడ్డారు. 15మంది అస్వస్థతకు గురికాగా, 8మంది ప్రభుత్వ వైద్యశాలలో, మిగిలినవారు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వైద్యాధికారి భానుప్రకాష్‌నాయక్ మాట్లాడుతూ పాయసం తినడం వల్లే అస్వస్థతకు గురయ్యారన్నారు. వైద్య బృందం ఆకుతోటపల్లిలో ఇంటింటా పర్యటించి అవసరం మేరకు వైద్యసేవలు అందిస్తామన్నారు. కాగా పాయసం తిని అస్వస్థతకు గురైన వారిని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మంగళవారం పరామర్శించారు.

ముగిసిన ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీలు

ప్రొసీడింగ్స్ జారీ చేయడంలో సిబ్బంది నిమగ్నం

అనంతపురం న్యూటౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ మంగళవారం ముగిసింది. స్థానిక ఎస్ఈ కార్యాలయంలోని సమావేశ భవనంలో సీనియార్టీకి అనుగుణంగా 5 సంవత్సరాలు పూర్తయిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, గతనెల ఆఖరులో బదిలీలు ప్రక్రియ ముగించారు. మరో 5 రోజులు గడువు పొడిగించడంతో 5వ తేదీలోపు పూర్తి చేయాల్సి ఉంది. తప్పిదాలను సరిదిద్దడంలో యంత్రాంగం నిమగ్నమైంది. సిఫార్సులకు అనుగుణంగా తుది జాబితా సిద్ధం చేయడానికి మరో రెండు రోజులు పట్టింది. ఎట్టకేలకు మంగళవారం జాబితాకు కలెక్టర్ ఆమోదం తెలపడంతో ప్రొసీడింగ్స్ జారీ చేయడంలో సిబ్బంది నిమగ్నమయ్యారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న 253 మందికి స్థానచలనం కల్పించారు. రిక్వెస్టు కింద 18 మందికి, అనారోగ్య కారణాలతో 8 మందిని బదిలీ చేశారు.

పంచాయతీ కార్యదర్శులకు..

ఉమ్మడి జిల్లాలోని గ్రేడ్-5, గ్రేడ్-6 (డిజిటల్ అసిస్టెంట్ల) బదిలీ ప్రక్రియ మంగళవారం ముగిసింది. అందుకు అనుగుణంగా ప్రొసీడింగ్స్ జారీ చేశారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి అనంతపురంలోని డీపీఓ కార్యాలయంలో గతనెల ఆఖరులో కౌన్సెలింగ్ నిర్వహించారు. తుది జాబితా సిద్ధం చేసి కలెక్టర్ ఆమోదానికి పంపారు. సిఫార్సులకు అనుగుణంగా అవకాశం కల్పించడానికి మరింత సమయం పట్టినట్లు తెలిసింది. ఎట్టకేలకు జాబితాకు కలెక్టర్ ఆమోదం తెలపడంతో మంగళవారం బదిలీల ప్రక్రియకు సంబంధించి ప్రొసీడింగ్స్ జారీ చేశారు.

చేనేత డిజైనర్‌కు జాతీయ అవార్డు



డిజైనర్ నాగరాజు

ధర్మవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చేనేత డిజైనర్ నాగరాజును డిజైన్ డెవలెప్‌మెంట్‌లో జాతీయ అవార్డు వరించింది. చేనేత డిజైన్ డెవలెప్‌మెంట్, మార్కెటింగ్ హ్యాండ్‌లూమ్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఈనెల 7న న్యూఢిల్లీలో జాతీయ అవార్డులను ప్రకటించినట్లు డిజైనర్ నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా 19 అవార్డులను ప్రకటించగా మన ఆంధ్రప్రదేశ్‌కు 3 అవార్డులు వచ్చాయన్నారు. అవార్డును ఆగస్టు 7న న్యూఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోనున్నట్లు నాగరాజు తెలిపారు.

మున్సిపల్ ఆర్డీగా రవీంద్రబాబు

కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్‌గా విశ్వనాథ్ బదిలీ



రవీంద్రబాబు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ శాఖ ప్రాంతీయ సంచాలకుడి(ఆర్డీ)గా రవీంద్రబాబు నియమితుడయ్యారు. ఇక్కడ ఆర్డీగా పనిచేస్తున్న విశ్వనాథ్‌ను కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్‌గా బదిలీ చేశారు. కర్నూలు కమిషనర్‌గా పనిచేస్తున్న రవీంద్రబాబును ఆర్డీగా నియమిస్తూ ఆ శాఖ ప్రత్యేక కార్యదర్శి సురేష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. రెండ్రోజుల్లో రవీంద్రబాబు ఆర్డీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

ప్లేస్‌మెంట్లు ఖరారు

అనంతపురం న్యూటౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందిన వారికి ప్లేస్‌మెంట్లు ఖరారు చేశారు. జిల్లా పంచాయతీ కార్యాలయం, ధర్మవరం డీఎల్‌పీఓ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న లీలాబాయి, విజయ్‌కుమార్, పామిడి గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి అశ్వత్థనాయుడుకు డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పించిన విషయం తెలిసిందే. వారికి డీపీఓ నాగరాజునాయుడు ప్లేస్‌మెంట్లు ఖరారు చేశారు. లీలాబాయి కంబదూరుకు, విజయ్‌కుమార్ శింగనమలకు, అశ్వర్థనాయుడు పామిడి డిప్యూటీ ఎంపీడీఓగా నియమించాలని రిక్వెస్టు పెట్టుకున్నారు. ఆ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

నా భర్త కనిపించట్లేదు

ఎమ్మెల్యేకి ఫిర్యాదు

నల్లమాడ, జూలై 8(ఆంధ్రజ్యోతి): తన భర్త రమణ కనిపించకుండా పోయాడని మండలంలోని దొన్నికోట గ్రామానికి చెందిన దేవరకొండ రాజేశ్వరి.. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డికి ఫిర్యాదు చేసింది. మంగళవారం మండలంలోని మూలప్పగారిపల్లిలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రాజేశ్వరి మాట్లాడుతూ.. తన భర్త గతనెల 15వ తేదీన ఇంటినుంచి వెళ్లిపోయాడనీ, తిరిగి రాలేదని తెలిపింది. ఎమ్మెల్యే వెంటనే ఇన్‌చార్జి ఎస్ఐ మల్లికార్జునరెడ్డికి ఫిర్యాదు అందించారు. అదృశ్యం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రాయలసీమకు సామాజిక న్యాయం చేయాలి

మానవ హక్కుల వేదిక రాష్ట్ర నేత ఎస్ఎం బాషా



మాట్లాడుతున్న మానవ హక్కుల వేదిక రాష్ట్ర నేత

అనంతపురం టౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రాంతానికి సామాజిక న్యాయం చేయాల్సిన అవసరం ఉందని మానవ హక్కుల వేదిక రాష్ట్ర నేత ఎస్ఎం బాషా పేర్కొన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం రాయలసీమ సమస్యలపై నిర్వహించిన చర్చా వేదికకు ఎస్ఎం బాషా హాజరయ్యారు. సెప్టెంబరు 14న ప్రజా ఉద్యమకారుడు పసలూరి ఓబులేసు ఆధ్వర్యంలో రాయలసీమ ప్రజావేదిక ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో స్థానికంగా ప్రజాసంఘాలు, మేధావుల సూచనలు, సలహాలకోసం చర్చావేదిక ఏర్పాటు చేశారు. ఎస్ఎం బాషా మాట్లాడుతూ... రాయలసీమలో తన సామాజిక ఉద్యమ చరిత్రలో మొదటిసారి సామాజిక రాయలసీమ అంశం చర్చకు వచ్చిందన్నారు. ఇది ఎంతో శుభదాయకమన్నారు. ఆయావర్గాలు ప్రజాక్షేత్రంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం తన విధానాల విషయంలో ఒకే రకంగా ఉండాలన్నారు. దేశంలోని అన్ని ఐజీటీల్లో రిజర్వేషన్లు ఉన్నాయనీ, తిరుపతిలో లేకపోవడం వెనుక కుట్ర ఏంటని ప్రశ్నించారు. రాష్ట్ర రాజధాని అమరావతిలోనూ ఉద్యోగ నియామకాల్లో రాయలసీమ అభ్యర్థులకు అన్యాయం వాటిల్లే ప్రమాదముందని వాపోయారు. అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు చంద్రాచర్ల హరి, బీటీపీ గోవింద్, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి వేమన, రాయలసీమ ప్రజాసమితి నాయకుడు శంకర కుళ్లాయప్ప, వైసీపీ ట్రేడ్ యూనియన్ నాయకుడు రాజారత్నం పాల్గొన్నారు.

అప్పు చెల్లించమన్నందుకే హత్య

మహిళ హత్యకేసులో నిందితుడి అరెస్టు



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

ధర్మవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): అప్పుగా ఇచ్చిన డబ్బును తిరిగి చెల్లించాలని అడిగిందన్న కోపంతో మహిళను హత్య చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ హేమంత్ కుమార్, వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలను వెల్లడించారు. పట్టణంలోని చింతా రమాదేవి వడ్డీ వ్యాపారంతో జీవనం సాగించేది. ఈక్రమంలోనే తన ఇంటి పక్కనే ఉన్న యలమకూరు రాజశేఖర్‌కు రెండేళ్ల కిందట రూ.10వేలు అప్పుగా ఇచ్చింది. కొన్ని రోజుల తర్వాత తన అప్పు తీర్చాలని రమాదేవి తరచూ రాజశేఖర్‌ను అడిగేది. దీంతో ఆయన రూ.5వేలు ఇచ్చి, మిగిలింది తరువాత ఇస్తానని చెప్పాడు. మరికొన్ని రోజుల తర్వాత మిగిలిన మొత్తం ఇవ్వాలని రాజశేఖర్ ఇంటికి వెళ్లి రమాదేవి డిమాండ్ చేశారు. ఇంటి వద్దకు వచ్చి డబ్బులు అడగడాన్ని అవమానంగా భావించిన రాజశేఖర్ గత నెల 29న రమాదేవి ఇంటిలోకి వెళ్లి ఆమెను కొట్టి, అరవకుండా నోరు మూసిపెట్టి కిందకు పడేశాడు. అనంతరం తాడుతో రమాదేవి గొంతును బిగించాడు. పెనుగులాటలో ఆమె ఎలాగోలా తప్పించుకుని ధర్మవరం ఆస్పత్రికి వెళ్లారు. మెరుగైన వైద్యం కోసం బంధువులు అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల నాలుగో తేదీ మృతిచెందారు. మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి, రాజశేఖర్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసును త్వరగా ఛేదించిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

రూ.12 లక్షల విలువైన ఆభరణాల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీసీఎస్, టూటౌన్ సీఐలు

అనంతపురం క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఇళ్లలో చోరీలకు పాల్పడే అంతర్రాష్ట్ర దొంగ విక్కీ అలియాస్ షామీర్(20)ను అనంతపురం సీసీఎస్, టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.12 లక్షల విలువైన ఆభరణాలు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అతడి నుంచి మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసిన షాపు నిర్వాహకుడిని అరెస్టు చేశారు. దొంగ అరెస్టు వివరాలను మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐలు వలి బాషా, జయపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌చౌదరి, ఎస్ఐ రుషేంద్రబాబు వెల్లడించారు. గుజరాత్ రాష్ట్రం సూరత్‌లోని రాంనగర్‌కు చెందిన సలీం కుమారుడు విక్కీ అలియాస్ షామీర్ ఆరేళ్ల వయసులో తప్పిపోయాడు. అనంతపురం చేరుకోగా కొందరు స్థానికంగా విజయనగర్ కాలనీలోని అనాథ వరణాలయంలో చేర్చారు. అక్కడే ఉంటూ రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో 9వ తరగతి వరకూ చదివాడు. ఈ క్రమంలో చిన్న చిన్న చోరీలు చేశాడు. రాత్రిళ్లు ఇళ్లలో చోరీలు చేస్తూ వచ్చాడు. అలా.. అనంతపురం టూటౌన్ పరిధిలో 2024 నవంబరులో విద్యుత్ నగర్ సర్కిల్‌లో ఓ ఇంట్లో వారం రోజుల్లోనే రెండుసార్లు చోరీ చేసి 2 బంగారు గాజులు అపహరించాడు. వన్‌టౌన్ పరిధిలో జూన్‌లో ద్విచక్రవాహనాన్ని అపహరించాడు. గతనెలలో గోవాలోనూ ఐఫోన్, యాపిల్ లాప్‌టాప్ అపహరించాడు. చోరీలపై కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అందులో భాగంగా నగర పరిధిలోని ప్రసన్నాయపల్లి రైల్వేగేటు వద్ద నిందితుడిని అరెస్టు చేశారు. అతడి నుంచి సెల్‌ఫోన్లు కొనుగోలు చేసిన ఫరూక్ మొబైల్ షాపు యజమాని ఫరూక్ ఖాన్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.12 లక్షల విలువైన ఆరు తులాల బంగారు గాజులు, 12 సెల్‌ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లు, స్కూటీ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు అధికారులు వివరించారు.

కడప విజయం

డ్రాగా ముగిసిన చిత్తూరు, అనంత మ్యాచ్

మల్టీ డే క్రికెట్ టోర్నీ



ధృవకుమార్ రెడ్డి



శ్రీకాంత్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మూడోరౌండ్ మల్టీ డే క్రికెట్ పోటీల్లో కడప జట్టు విజయం సాధించగా, చిత్తూరు-అనంతపురం మ్యాచ్ డ్రాగా ముగిసింది. సీనియర్ మల్టీ డే క్రికెట్ మూడో రౌండ్ పోటీలు సోమవారం స్థానిక అనంత క్రీడా గ్రామంలో చివరిరోజు కొనసాగాయి. అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్‌లో చిత్తూరు-అనంతపురం జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు 115.2 ఓవర్లలో 455 పరుగులకు ఆలౌటైంది. ఆతిథ్య అనంతపురం జట్టు ఓవర్‌నైట్ స్కోరు 199/4తో మూడోరోజు మంగళవారం మొదటి ఇన్నింగ్స్ కొనసాగించింది. 90 ఓవర్లలో 377 పరుగులకు ఆలౌటైంది. దత్తారెడ్డి సెంచరీ (164)కితోడు గిరినాథ్‌రెడ్డి (37) పర్వాలేదనిపించాడు. చిత్తూరు బౌలర్ శ్రీకాంత్ 5, ఆశిష్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 40 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 192 పరుగులు చేసింది. ధరణీ కుమార్ (81), మోనిష్ (64), జ్ఞానేశ్వర్ (41) రాణించారు. చివరి రోజు కావడంతో మ్యాచ్‌ను డ్రాగా నిర్ణయించారు. రాయలసీమ్ క్రికెట్ గ్రౌండ్‌లో నెల్లూరు, కడప జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు 65 ఓవర్లలో 288 పరుగులకు ఆలౌటైంది. అనంతరం మొదటి ఇన్నింగ్ ప్రారంభించిన కడప 69.1 ఓవర్లలో 144 పరుగులకు ఆలౌటైంది. నెల్లూరు రెండో ఇన్నింగ్స్‌లో 47.5 ఓవర్లలో 215 పరుగులకు ఆలౌటైంది. 260 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప 43.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 263 పరుగులు సాధించింది. ధృవ కుమార్ రెడ్డి సెంచరీ (101), ధనుష్ హాఫ్ సెంచరీ(56)తో జట్టును విజయతీరాలకు చేర్చారు.

సమ్మెను విజయవంతం చేయండి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

అనంతపురం టౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర కార్మిక సంఘాల పిలుపు నేపథ్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ పిలుపునిచ్చారు. యూనియన్ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని, దీని కారణంగా ఎన్నో త్యాగాలు చేసి, పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు నిర్వీర్యమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులందరూ సమ్మెకు మద్దతుగా బుధవారం జిల్లా వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ఉపాధ్యక్షుడు మస్నీల రామాంజనేయులు పాల్గొన్నారు.

సాసైటీలకు త్రిసభ్య కమిటీల నియామకం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదవీకాలం ముగిసిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సొసైటీ)కు త్రిసభ్య కమిటీలను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ-సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల రోజుల పాటు త్రిసభ్య కమిటీల కాలపరిమితి విధించారు.

సొసైటీ పేరు	సొసైటీ చైర్మన్	కమిటీ సభ్యులు
చియ్యేడు	లక్ష్మీనారాయణ	శ్రీరాములు, సుధాకర్ రెడ్డి
మరూరు	గోపాల్	గంగాధర్, ముసలప్ప
శింగనమల	జి. లక్ష్మీనారాయణ	బాలరాజు, లక్ష్మి
భైరవానితిప్ప	బోయ ఓబులేసు	శివలింగమూర్తి, ధనుంజయ్య
శెట్టూరు	రంగప్పచౌదరి	వెంకటేష్, ఖాదర్‌వలి
శ్రీధరఘట్ట	ఎర్రిస్వామి	మోహన్‌రెడ్డి, రుద్రముని
ఉద్దేహాళ్	మల్లికార్జున	లేపాక్షి, మృతుంజయ్య
గొడిసెలపల్లి	ఆర్ హనుమంతరెడ్డి	పరమేశ్వరప్ప, బ్రహ్మానందరెడ్డి
ఎం హనుమాపురం	బింది హనుమంతరెడ్డి	రామాంజనేయులు, మేఘనాథ్‌రెడ్డి
మల్లికేతి	మల్లికార్జున రెడ్డి	గూలెప్ప, భీమక్క
కలుగోడు	నీరగంటి తిమ్మప్ప	దేవిప్రసాద్, పెద్దరామప్ప
బ్రహ్మసముద్రం	బోయ రామంజనేయులు	మేఘనాథ్, తిప్పయ్య
కణేకల్లు	చంద్రశేఖర్ గుప్తా	హనుమప్ప, సువర్ణమ్మ
74-ఉడేగోళం	ఓబయ్య	తిప్పేస్వామి, శశిధర్

ఈ సొసైటీలకు ఈనెల 30వ తేదీ వరకు మాత్రమే కాలపరిమితి విధించారు.

- అక్టోబరు 30వరకు బుక్కచెర్ల సొసైటీ చైర్మన్‌గా బ్రహ్మానందరెడ్డి, సభ్యులుగా కిష్టయ్య, సుబ్బమ్మకు కాలపరిమితి విధించారు.

సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

అనంతపురంరూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ ప్రవేశాల సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం ప్రారంభమైంది. అనంతపురం జేఎన్‌టీయూ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ ఎంసెట్ హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేసిన విషయం విదితమే. హెల్ప్‌లైన్ సెంటర్‌కు హాజరైన విద్యార్థుల సర్టిఫికెట్లను జేఎన్‌టీయూ అడ్మిషన్ల డైరెక్టర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో పరిశీలన చేపట్టారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేశారు. అడ్మిషన్ల డైరెక్టర్ మాట్లాడుతూ.. వెబ్ కౌన్సెలింగ్ పూర్తయ్యే వరకు హెల్ప్‌లైన్ సెంటర్ అందుబాటులో ఉంటుందన్నారు. విద్యార్థులు కౌన్సెలింగ్ ప్రక్రియతో పాటు, సర్టిఫికెట్ల అప్‌లోడ్ ఇతరత్రా సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈడబ్ల్యూఎస్ కోటా విద్యార్థులు సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయడంలో పొరబాట్లు చేస్తున్నారన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల పేరున సర్టిఫికెట్లను తీసుకుని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. స్పెషల్ కేటగిరీ (స్పోర్ట్స్, ఎన్‌సీసీ, సీఏపీ) తదితర వాటి కింద అడ్మిషన్ పొందాలనుకునే విద్యార్థులు విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకే వెళ్లాల్సి ఉంటుందన్నారు. ప్రతి విషయాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వివరిస్తున్నామన్నారు.

ఐఈఆర్టీల రెగ్యులర్‌కు అడుగులు

అనంతపురం విద్య, జూలై 8(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష పరిధిలోని ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ విభాగంలో పనిచేస్తున్న ఐఈఆర్టీలను రెగ్యులర్ చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న ఐఈఆర్టీల అర్హతలను పరిశీలించడానికి స్క్రీనింగ్ కమిటీని మంగళవారం రాష్ట్రప్రభుత్వం నియమించింది. ఉమ్మడి అనంత జిల్లాలో 60 మంది ఐఈఆర్టీలు పనిచేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల ఐఈఆర్టీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముగ్గురిపై హత్య కేసు

గాండ్లపెంట, జూలై8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టకిందపల్లిలో జరిగిన రంగారెడ్డి హత్యలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నాగేంద్ర మంగళవారం తెలిపారు. పోలీసులు తెలిపిన మేరకు సోమవారం గుట్టకిందపల్లిలో రంగారెడ్డిని హత్య చేశారన్నారు. మంగళ వారం సీఐ, ఎన్పీకుంట ఎస్ఐ వలీబాషా సంఘటనా స్థలాన్ని పరిశీలించి, విచారణ చేపట్టారు. మృతుడి వదిన వెంకటరత్నమ్మ ఫిర్యాదు మేరకు... సోమవారం ఫీల్డు అసిస్టెంట్ మనోహర్ ఇంటివద్ద ఉపాధి బిల్లులు పెట్టులేదని రంగారెడ్డి వాగ్వాదం చేశాడు. అదే రోజు రాత్రి రంగారెడ్డితో ఫీల్డ్ అసిస్టెంట్ మనోహర్, దాద్దెప్ప, భార్య స్వాతి ఘర్షణకు దిగారు. ఈక్రమంలో రంగరారెడ్డిని తోసేయడంతో సిమెంటు రోడ్డుపై పడి, అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామన్నారు. నిందితులు పరారీలో ఉన్నట్లు చెప్పారు.

ఆ నలుగురిపై సస్పెన్షన్ రద్దు

వాణిజ్య పన్నులశాఖ అధికారులకు పోస్టింగ్

అనంతపురం కలెక్టరేట్, జూలై 8(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖలో నలుగురు అధికారులపై సస్పెన్షన్‌ను రద్దు చేశారు. వారిలో ముగ్గురు అధికారులకు పోస్టింగ్ సైతం కేటాయించారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం సర్కిల్‌లో పనిచేస్తున్న సీటీఓ క్రిష్ణవేణి, డీసీటీఓలు మధుసూదన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఇంతియాజ్ అహ్మద్‌పై ఆరోపణలు రావడంతో విచారించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 25న ఆ నలుగురిని సస్పెండ్ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఆ నలుగురిపై సస్పెన్షన్ రద్దు చేస్తూ వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ అహ్మద్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. వారికి పోస్టింగ్ సైతం ఇచ్చారు. సీటీఓ క్రిష్ణవేణిని వైఎస్సార్ కడప జాయింట్ కమిషనర్ కార్యాలయంలో సీటీఓగా నియమించారు. డీసీటీఓలు మధుసూదన్ రెడ్డిని కడప జిల్లా రాజంపేట సర్కిల్‌కు, రాజశేఖర్ రెడ్డిని కడప జిల్లా పులివెందులకు, ఇంతియాజ్ అహ్మద్‌ను చిత్తూరు-2 సర్కిల్‌కు కేటాయించారు.

సౌత్‌జోన్ కాన్ఫరెన్స్‌లో 'అనంత' పీజీల ప్రతిభ



పతకాలు సాధించిన వైద్య విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

అనంతపురం వైద్యం, జూలై 8(ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ కాన్ఫరెన్స్‌లో అనంత వైద్య కళాశాల అనస్థీషియా పీజీ విద్యార్థులు అదరగొట్టారు. ఈనెల 4, 5, 6 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన దక్షిణ భారత రాష్ట్రాల అనస్థీషియా సదస్సులో కళాశాల పీజీ వైద్య విద్యార్థులు నాలుగు బంగారు పతకాలు సాధించారు. పతకాలను సాధించిన విద్యార్థులను మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్ షారోన్‌సోనియా, అనస్తీషియా విభాగాధిపతి నవీన్ కుమార్ అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్రీ పేపర్ విభాగంలో డాక్టర్ గౌతమి, క్విజ్‌పోటీల్లో డాక్టర్ పూజ, సుధీర్, రీల్స్ విభాగంలో డాక్టర్ శ్రీధర్ సౌత్ జోన్ అవార్డులు సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ కేఎల్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ నాగేంద్ర, మధుసూదన్, జగదీశాచార్యులు, హరికృష్ణ, గంగాధర్, సోమశేఖర్, షెలియా షైనీ పాల్గొన్నారు.

గంజాయి కట్టడికి పోలీసుల తనిఖీలు

అనంతపురం క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా, విక్రయాల నియంత్రణ కోసం అనంతపురం పోలీసులు నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు జగదీష్, శాంతిలాల్, ఇతర సిబ్బంది గంజాయి అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. రంగస్వామినగర్, రుద్రంపేట, డీమార్ట్ వెనుక వైపు ప్రాంతంలో పలు చోట్ల తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గంజాయి అమ్మినా, కొనుగోలు చేసినా, అక్రమంగా రవాణా చేసినా చట్టా రీత్యా నేరం అన్నారు. గంజాయి నియంత్రణ కోసం జిల్లా ఎస్పీ, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. గంజాయి రహిత నగరమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామన్నారు. చట్టాలు కఠినంగా ఉన్నాయని, ఎవరూ గంజాయి జోలికి వెళ్లవద్దని ఆయన హెచ్చరించారు.

న్యూఢిల్లీకి కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. దేశ రాజధానిలో బుధవారం నిర్వహించే జాతీయ డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్(డీఎంఎఫ్) వర్క్‌షాప్‌లో కలెక్టర్ పాల్గొననున్నారు. కలెక్టర్ గురువారం జిల్లాకు రానున్నారు.

11న వాహనాల వేలం

అనంతపురం క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 11న వేలం వేయనున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు పాల్గొని వాహనాలు తీసుకోవచ్చన్నారు. వివరాలకు అనంతపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణను కలవాలని ఆయన సూచించారు.

యువతిని కాపాడిన పోలీసులు

గుంతకల్లుటౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): చనిపోతున్నానంటూ తండ్రికి మెసేజ్ పెట్టిన యువతిని టూటౌన్ పోలీసులు కాపాడారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాతగుంతకల్లులో నివాసముంటున్న కురువ శివప్ప కుమార్తె డిగ్రీ చదువుకుంది. సోమవారం రాత్రి 7 గంటలకు యువతి ఎవరికీ చెప్పకుండా కోపంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. చనిపోతున్నానంటూ తండ్రికి ఫోన్ ద్వారా మెసేజ్ చేసింది. దీంతో ఆందోళన చెందిన తండ్రి.. టూటౌన్ పోలీసు స్టేషన్‌లో రాత్రి 8.30 గంటలకు ఫిర్యాదు చేశాడు. టూటౌన్ సీఐ మస్తాన్.. సిబ్బందితో యువతి ఫోన్ లోకేషన్ ఆధారంగా వెతకడం మొదలు పెట్టారు. అర్ధరాత్రి గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని, యువతిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. తల్లిదండ్రులను పిలిపించి ఆ యువతిని అప్పగించారు.

అంగన్‌వాడీ భవనాలు పూర్తయ్యేదెన్నడో..?

● నిధుల కొరతతో సగంలోనే ఆగిన నిర్మాణాలు ● ఇరుకు గదుల్లో చిన్నారుల అవస్థలు



బండమీదపల్లిలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం, అయ్యవారిపల్లిలో నిలిచిపోయిన భవన నిర్మాణం

రాప్తాడు, జూలై 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. భవన నిర్మాణాలకు ప్రభుత్వం సకాలంలో బిల్లులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు మధ్యలోనే ఆపేశారు. దీంతో సగం నిర్మించిన అంగన్‌వాడీ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఆయా గ్రామాల్లో అద్దె భవనాలు, ఇతర ప్రభుత్వ భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఇరుకు గదుల్లో చిన్నారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం 2021లో మండలంలోని హంపాపురం, అయ్యవారిపల్లి, బండమీదపల్లి, పాలచెర్ల గ్రామాల్లో నూతన అంగన్‌వాడీ భవనాలకు నిధులు మంజూరు చేసింది. హంపాపురం, అయ్యవారిపల్లి భవనాలకు రూ.8 లక్షలు కేటాయించడంతో కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించారు. అయ్యవారిపల్లిలో ప్రాథమిక పాఠశాల ఆవరణంలో నిర్మాణ పనులు చేపట్టి మధ్యలోనే నిలిపివేశారు. హంపాపురంలో భవన నిర్మాణ పనులు ప్రారంభించి పిల్లర్లు వేసి గోడ కూడా నిర్మించారు. చేసిన పనులకు రూ.2 లక్షల వరకూ బిల్లు కాంట్రాక్టరు ఖాతాలో జమ అయ్యాయి. తరువాత నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. గ్రామంలో ఇతర ప్రభుత్వ భవనంలో కేంద్రం నిర్వహిస్తున్నారు. అదే గ్రామంలో మరో అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రాథమిక పాఠశాల భవనంలోని ఓ గదిలో కేంద్రం నిర్వహిస్తున్నారు. బండమీదపల్లిలో నాడు-నేడు పథకం ద్వారా అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రూ.13.50 లక్షలు కేటాయించారు. 80 శాతం పనులు పూర్తి చేశారు. భవనానికి డోర్లు, టైల్స్, పెయింటింగ్ తదితర చిన్న చిన్న పనులు చేయకపోవడంతో అది నిరుపయోగంగా ఉంది. ప్రస్తుతం చర్చి భవనంలో నిర్వహిస్తున్నారు. పాలచెర్లలో అంగన్‌వాడీ భవనం స్లాబ్ వరకూ పూర్తి చేశారు. తర్వాత నిధులు మంజూరు కాకపోవడంతో పనులు ఆపేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి భవన నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హేమలత, నాగరత్న ను వివరణ కోరగా.. హంపాపురం, బండమీదపల్లి, అయ్యవారిపల్లి, పాలచెర్లలో అంగన్‌వాడీ భవన నిర్మాణల పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలిపామని వివరించారు.

‘ఉపాధి’ పథకాలను సద్వినియోగం చేసుకోండి: పరిటాల సునీత



పండ్ల మొక్క నాటుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కింద పండ్లతోటల పెంపకం కార్యక్రమాన్ని మంగళవారం చెర్లోపల్లిలో ఆమె ప్రారంభించారు. గ్రామానికి చెందిన రాకేశ్ అనే రైతుకు చెందిన పొలంలో 280 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ఉపాధి హామీ పథకం రైతులకు ఒక వరంలాంటిదని అన్నారు. గత ప్రభుత్వంలో ఈ పథకాన్ని టీడీపీ వారా వైసీపీ వారా అని చూసి చేశారని విమర్శించారు. ఈ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా పథకాలను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామ్మూర్తినాయుడు, రంగయ్య, పరందాయయాదవ్, సుధాకర్, చంద్రప్ప, శ్రీధర్‌నాయుడు, ప్రభాకర్, తిమ్మానాయుడు, నారాయణ, ముత్యాలు, దాదు, శ్రీనివాసులు, మురళి, డ్వామా అధికారులు పాల్గొన్నారు. అదే విధంగా చెర్లోపల్లిలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్తూ ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించివివరించారు. పథకాల పేర్లు చదువుతూ మీ ఇంటిలో ఎన్ని పథకాలు వచ్చాయని ఆరాతీశారు. ఎమ్మెల్యే స్వగ్రామం వెంకటాపురంలో ప్రాథమిక పాఠశాలలో విద్యామిత్ర కిట్లను పంపిణీచేశారు. యల్లమ్మ దేవాలయంలోపూజలు చేయించి ఈ కిట్లను అందజేశారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు.

రూ.118 కోట్లతో అభివృద్ధి పనులు: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో తొలి ఏడాదిలోనే అనంతపురంలో రూ.118 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం 27వ డివిజన్‌లో జరిగిన తొలి అడుగు కార్యక్రమంలో అనంతపురం ఎమ్మెల్యేతోపాటు, పార్టీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నియోజవర్గ పరిశీలకుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. తొలి అడుగులో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ... ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి తెలియజేశారు. తర్వాత ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మాట్లాడుతూ.. ఒక్క ఏడాది కాలంలోనే అనంతపురం నగరంలో రూ.118 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. నగరానికి రూ. 750 కోట్లతో భూగర్భడ్రైనేజీ తీసుకొస్తామని హామీ ఇచ్చారు. సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో పోలవరం, అమరావతి నిర్మాణాలు జెట్ స్పీడ్‌తో సాగుతున్నాయన్నారు. ప్రధాని మోదీ సైతం ఆయన పనితీరును మెచ్చుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సరిపూటి రమణ, తలారి ఆదినారాయణ, బల్లా పల్లవి, గాజుల ఆదెన్న, సరిపూటి శ్రీకాంత్, బాలాంజినేయులు, ఫిరోజ్ అహ్మద్, పరమేశ్వర్, క్రిష్ణకుమార్, సు ధాకర్ యాదవ్, నారాయణస్వామి, మణికంఠ, మున్వర్, బాషా పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలని ర్యాలీ



ఆటోలతో ర్యాలీ చేస్తున్న వామపక్ష నాయకులు

అనంతపురం విద్య, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కార్మికవ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని వామపక్షాల నాయకులు పిలుపునిచ్చారు. నగరంలో మంగళవారం ఏఐటీయుసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటోలతో ర్యాలీ కొనసాగించారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నుంచి టవర్‌క్లాక్ మీదుగా సప్తగిరిసర్కిల్ వరకు ర్యాలీ కొనసాగించారు. కార్యక్రమంలో నాయకులు రాజారెడ్డి, నాగేంద్రకుమార్, రాజేష్ గౌడు, ఏసురత్నం, కృష్ణుడు, వెంకట్, శ్రీనివాసులు, అజాంబాష, ఆదినారాయణ, రాజు, నాగరాజు, స్వాతి, కవిత పాల్గొన్నారు.

పోలీసులు అదుపులో కేబుల్‌వైరు దొంగలు

శింగనమల, జూలై 8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మోటార్లు, బోర్ల వద్ద కేబుల్ వైర్లు చోరీ చేస్తున్నారని తరిమెల గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామానికి చెందిన నలుగురిని శింగనమల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం తరిమెల గ్రామంలో గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామానికి చెందిన ఇద్దరు మగ, ఇద్దరు ఆడవారు ఆటోలో వచ్చి గ్రామంలో వ్యసాయ బోర్లు వద్ద తిరుగుతుండాగా గ్రామస్థులు, రైతులు వారిని పట్టుకుని శింగనమల పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ విజయ్ కూమార్ మాట్లాడుతూ.. అదుపులో ఉన్న నలుగురిని విచారణ చేస్తున్నామన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కనగానపల్లి, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తగరకుంట గ్రామంలో మంగళవారం సాయంత్రం ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నితీష్‌కుమార్ ఆర్థిక ఇబ్బందులతో మనోవేదనకు గురైన ఇంట్లో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు కిందకు దింపి ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్య సేవల నిమిత్తం అనంతరపురం తరలించారు.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి



కేక్ కట్ చేస్తున్న శైలజానాథ్

శింగనమల, జూలై 8(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా శింగనమలలో ఆయన విగ్రహానికి వైసీపీ శ్రేణులు ఘన నివాళులరించాయి. మంగళవారం శింగనమలలో వైఎస్ జయంతి సందర్భంగా నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త సాకే శైలజానాథ్, నాయకులు తరిమెల గోకుల్‌రెడ్డి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి..ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమం వైసీపీ నాయకులు పూల ప్రసాద్, వీరాంజనేయులు, శ్రీరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటరాముడు పాల్గొన్నారు.

● అనంతపురంరూరల్ : మండలంలోని రుద్రంపేట పంచాయతీ పరిధిలోని కుటుంబంలోని ఒక్కరికి ఎంఎస్ఎస్ సేవాసంస్థ ఆధ్వర్యంలో ప్రమాద బీమా ఇస్తామని సంస్థ అధ్యక్షుడు సాదిక్ వలి అన్నారు. చంద్రబాబు కొట్టాల్లో మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా ప్రమాద బీమాకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మహబూబ్‌బీ, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సుధీర్ రెడ్డి, మూర్తి, పరంధామ, షరీఫ్ పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకం ప్రారంభం

అనంతపురంరూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపల్లి పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి రాప్తాడు స్పెషల్ ఆఫీసర్, డిప్యూటి కలెక్టర్ రామ్మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామానికిచెందిన రైతులు వెంకటేశులు, వెంకటప్ప పొలాల్లో మామిడి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ.. రైతులు ఉద్యాన పంటల వైపుదృష్టి సారించడానికి ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి సహకారం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దివాకర్‌బాబు, ఏపీఓ నాంచారమ్మ, సర్పంచు శివశంకర్, టెక్నికల్ అసిస్టెంట్ నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ నరేష్ పాల్గొన్నారు.

● ఆత్మకూరు: ఉపాధి హామీ పథకంలో అర్హులైన ప్రతి రైతుకు పండ్ల మొక్కలు ఇస్తామని డ్వామా పీడీ సలీంబాషా తెలిపారు. మంగవారం ఆత్మకూరు పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో చిన్న సన్న కారురైతులకు పండ్లమొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బిల్లే విజయలక్ష్మి, ఏపీవో వెంకటనారాయణ, ఈసీ సయ్యద్‌బబ్లు, రామ్మోహన్, టీడీపీ మండల కన్వీనర్ బోయ గంతా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల పట్ల మానవత్వం చూపండి

అనంతపురం విద్య, జూలై 8(ఆంధ్రజ్యోతి): వృద్ధులపట్ల ప్రతి ఒక్కరూ మానవత్వం చూపించాలని ఆ శాఖ సహాయ సంచాలకులు అర్చన సూచించారు. మంగళవారం వయోవృద్ధుల సంక్షేమ వసతి గృహంలో వృద్ధుల సంరక్షణపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో అండగా నిలవాల్సిన కుటుంబ సభ్యులు వారిపట్ల చిన్నచూపు చూస్తుండడం బాధాకరం అన్నారు. స్వార్థంతోనే వారి జీవన విధానంపై దృష్టిపెడుతున్నారన్నారు. వయోవృద్ధ తల్లిదండ్రులను అక్కునచేర్చుకొని వృద్ధాశ్రమాల నిర్వాహకులు అందిస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. ఇందుకు హైదరాబాద్‌కు చెందిన హెరిటేజ్ సంస్థ అన్ని విధాలాసహాయసహకారాలు అందించడం పట్ల ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

జలధికి తరలిన పీర్లు

అనంతపురంరూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగుంట గ్రామంలో మొహర్రం వేడుకలు కన్నుల పండుగగా సాగాయి. మంగళవారం జలధి కార్యక్రమం వైభవంగా సాగింది. చావిడి ఎదుట అగ్నిగుండ ప్రవేశం చేయించారు. గ్రామంతోపాటు, చుట్టుపక్కల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని చక్కెర చదివించారు.



జలధి సందర్భంగా కురుగుంట, బండమీదపల్లి, తరిమెల గ్రామాల్లో ఊరేగుతున్న పీర్లు

●రామగిరి: మండలంలో పలు గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలలో భాగంగా జలధి కార్యక్రమాన్ని నిర్వహించారు. గరిమేకలపల్లి, మాదాపురం, ఆర్‌కొత్తపల్లి, శేషంపల్లి, గంతిమర్రి, పెనుబోలు గ్రామాలలో వేడుకలను జరుపుకున్నారు. అలావ్ తొక్కుతూ ఆనందోత్సవాల మధ్య పీర్లను జలధికి తరలించారు.

● శింగనమల: మండలంలో పలు గ్రామాల్లో మొహర్రం సందర్భంగా పీర్లను జలధికి తరలించారు. మండలంలో ని తరిమెల, చిన్నజలాలపురం, పెరవలి, ఈస్టునరసాపురం, సోదనపల్లి, గురుగుంట్ల, నిదనవాడ, మదిరేపల్లి పీర్లను ఊరేగింపు అనంతరం జ లధికి తరలించారు.

● రాప్తాడు: మండలంలోని బండమీదపల్లి, బోగినేపల్లి గ్రామాల్లో వైభవంగా జలధి నిర్వహించారు. ఉదయం పీర్లను ఎత్తుకుని భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. సాయంత్రం ఊరేగించారు.

● గార్లదిన్నె : మండలంలోని గార్లదిన్నె, మర్తాడు, యర్రగుంట్ల, ముకుందాపురం, బూదేడు, కల్లూరు, కేశవాపురం, పాపినేపాళ్యం, పెనకచెర్ల, కొత్తపల్లి గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా ముగిశాయి.

న్యూస్ బాక్స్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



అర్ధనగ్న ప్రదర్శనలో సీఐటీయూ, మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా మున్సిపాలిటీలను నమ్ముకుని వేలాది మంది ఇంజనీరింగ్ కార్మికులు పనిచేస్తున్నారని, శ్రమకుతగ్గ వేతనం కోసం పోరాడుతున్నా ఫలితం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఓబుళపతి, మురళి, పోతులయ్య, శివన్న, సుబ్బిరెడ్డి, లక్ష్మి, రవికిరణ్, సలీం, దాదూ, వన్నప్ప పాల్గొన్నారు.

ఓటరు జాబితా తయారీలో బీఎల్వోలు కీలకం

అనంతపురంరూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా నిర్వహణలో బూత్ లెవల్ ఆఫీసర్ల పాత్ర కీలకమని ఈఆర్ఓ, హెచ్ఎల్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్ అన్నారు. మంగళవారం అనంతపురంరూరల్, ఆత్మకూరు, రాప్తాడు పరిధిలోని బీఎల్వోలకు ఓటరు జాబితా నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు మోహన్‌కుమార్, విజయకుమారి, లక్ష్మణ్‌నాయక్, శిక్షకుడు అహ్మద్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

కులవృత్తిదారులను ఆదుకోవాలి



ఆందోళన చేస్తున్న చేతివృత్తిదారులు

అనంతపురం విద్య, జూలై 8(ఆంధ్రజ్యోతి): కులవృత్తిదారులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ వద్ద చేతివృత్తి దారుల సమాఖ్య ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లింగమయ్య మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం కులవృత్తులను ఆదుకుంటామని అనేక హామీలు ఇచ్చిందన్నారు. ఏడాది దాటినా ఏమాత్రం హామీలు అమలుకు చర్యలు తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు పోతులయ్య, భాష, నాగప్ప, మల్లికార్జున, గాజులింగ, జానకి, శ్రీనివాసులు, శవ్వరయ్య, రాము, వీరాంజి, నాగరాజు పాల్గొన్నారు.

●నార్పల : చేతి వృత్తి దారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నార్పల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్‌రావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పెద్దపెద్దన్న శివశంకర్, శివయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కనగానపల్లి, జూలై 8(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. రామగిరి మండలం కలికివాండ్లపల్లికి చెందిన ముసలప్ప(32) ద్విచక్రవాహనంలో వెళుతూ గత నెల 14న రోడ్డు ప్రమాదంలో దాదులూరు వద్ద తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి పలు ఆసుపత్రులలో చికిత్స పొందుతూ మంగళవారం హైదరాబాదులో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ముసలప్ప భార్య ముత్యాలమ్మ పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు సమాచారం.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్

అనంతపురంరూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి):హైదరాబాద్‌కు చెందిన ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్ ఫౌండేషన్, దివ్యాంగుల ఇంకుబేటర్ డీహబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న హైడియాథన్ స్టార్టప్ పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ఇంకుబేషన్ సెంటర్ సీఈఓ చంద్రమౌళి మంగళవారం ఆవిష్కరించారు. ఇంకుబేటర్ డీహబ్ ప్రతినిధి సతీష్ మాట్లాడుతూ.. యువత వ్యాపార రంగంలో ముందుకు వెళ్లడానికి, ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్సైజ్ డీట్, స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్ టాస్క్‌తో కలసి హైడియాథన్ స్టార్టప్ పోటీలను తెలుగు రాష్ట్రాల్లో నిర్వహిస్తున్నారన్నారు. పోటీల్లో పాల్గొనాలి అనుకునే వారు www.prideofhyderabad.org వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు అని తెలిపారు.

టీడీపీతోనే సంక్షేమం

అనంతపురంరూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని క్లస్టర్ ఇన్‌చార్జ్ డిష్ నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం ఎ.నారాయణపురం పంచాయతీ ఇందిరమ్మకాలనీలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ డిష్ నాగరాజు, నాయకులు ఓబుళపతి, రఘునాథ్, భాగ్యరాజ్ తదితరులు ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను వివరించారు. అమలు చేస్తున్న పథకాలను తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు వరాలమ్మ, ఈశ్వరయ్య, ముత్యాలు, హరి పాల్గొన్నారు.

పేదల కుటుంబాల్లో వెలుగులు: ఎమ్మెల్యే



చెన్నంపల్లిలో వృద్ధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

బుక్కరాయసముద్రం, జూలై 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాకతో పేదల కుటుంబాల్లో వెలుగులు నిండాయని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని చెన్నంపల్లిలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేపట్టిన పథకాలపై వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏ ఇం టికి వెళ్లినా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వంపై వృద్ధులు, మహిళలు హర్షం తెలుపుతున్నారని అన్నారు. చెన్నంపల్లిలో అండర్ డ్రైనేజీ కాలువలు ఏర్పాటుతో పాటు రూ. 20లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు. చెన్నంపల్లిలో ఉపాధి హామీ పథకం ద్వారా పండ్లతోటల పెంపకం కింద మామిడి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతు నాగలక్ష్మి తోటలో మామిడి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, ఎంపీడీఓ సాల్మన్‌రాజ్, టీడీపీ నాయకులు పసుపుల శ్రీరామిరెడ్డి, మల్లికార్జున రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ మల్లిఖార్జున పాల్గొన్నారు.

మహిళలను అవమానించేలా ప్రసన్నకుమార్‌రెడ్డి వాఖ్యలు

బుక్కరాయసముద్రం/శింగనమల: సమాజంలో మహిళా జాతిని అవమానించే విధంగా కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డి వాఖ్యలు ఉన్నాయని, అలాంటి వారిని రాజకీయలలో లేకుండా చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. నెల్లూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై అనుచిత వాఖ్యలు చేసిన ప్రసన్న కుమార్‌రెడ్డిని వైసీపీ అధినేత జగన్ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ పార్టీ దిగజారుడుకు ఆయన వ్యాఖ్యలు నిదర్శనమన్నారు.

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై విమర్శలు సరికాదు



సిమెంట్ పోలన్న

అనంతపురం క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కొవ్వూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే విమర్శలు సరికాదని టీడీపీ రాష్ట్ర నాయకుడు సిమెంట్ పోలన్న హెచ్చరించారు. మంగళవారం ఆయన ‘ఆంధ్రజ్యోతి’తో మాట్లాడారు. కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి నోటికొచ్చినట్టు టీడీపీ ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణం అన్నారు. మహిళా ప్రజాప్రతినిధుల గౌరవం దెబ్బ తీసే విధంగా మాట్లాడటం సరికాదన్నారు. ఒక మహిళా ప్రజాప్రతినిధిని లక్ష్యంగా చేసుకుని అవమానకరంగా వ్యాఖ్యలు చేయడం సబబుకాదన్నారు. వెంటనే ప్రశాంతిరెడ్డికి క్షమాపణ చెప్పాలన్నారు. భవిష్యత్తులో ఇదే పునరావృతమయితే సహించేది లేదన్నారు.

నగరపాలక సంస్థ ఎస్ఈగా రాజశేఖర్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ఎస్ఈగా రాజశేఖర్ నియమితులయ్యారు. తాడేపల్లి పబ్లిక్ హెల్త్‌లో పనిచేస్తున్న రాజశేఖర్‌ను అనంతపురం నగరపాలక సంస్థ ఎస్ఈగా నియమిస్తూ మంగళవారం మున్సిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు ఎస్ఈగా ఉన్న చంద్రశేఖర్ గత నెల పదవీవిరమణ పొందారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరిటాల సునీత పరామర్శ

చెన్నేకొత్తపల్లి, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులేటిపల్లికి చెందిన టీడీపీ నాయకుడు నారాయణరెడ్డి ఈనెల 4న గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి భార్య సరోజమ్మను, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందన్నారు.

పోలీసులకు వైద్య పరీక్షలు

అనంతపురం క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసుల సంక్షేమంలో భాగంగా మంగళవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని పోలీసు ఆసుపత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించారు. సబ్ డివిజన్, ఏఆర్, మినిస్ట్రీరియల్ సిబ్బందితోపాటు హోంగార్డులకు షుగర్, బీపీ, ఈసీజీ, లివర్ ఫంక్షనింగ్, కిడ్నీ ఫంక్షనింగ్, లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్, రక్త పరీక్షలు తదితర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, వైద్యులు వెంకటేశ్వరప్రసాద్, సీఐలు శాంతిలాల్, జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన అవసరం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని.. సద్వినియోగంతోనే సత్ఫలితాలు సాధ్యమవుతాయని మై భారత్ అధికారులు తెలిపారు. కేంద్ర యువజన క్రీడా వ్యవహారాల శాఖ మై భారత్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ సమీపంలోని మై భారత్ కార్యాలయంలో యువతకు ప్రభుత్వ పథకాలపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో మై భారత్ రాష్ట్ర కోఆర్డినేటర్ బిసాటి భరత్, దూరదర్శన్ విశ్రాంత డైరెక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీనివాసులు, రూడ్‌సెట్ శిక్షకురాలు ఉషారాణి, ప్రముఖులు జయమారుతి, ఫాతిమా, రామకృష్ణ, అనురాధి, బాలాజీ, వంశీకృష్ణ, అంబరీష్, కార్తీక్, ప్రవీణ్ పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు భూమిపూజ

శింగనమల, జూలై 8(ఆంధ్రజ్యోతి): శింగనమల చెరువు వద్ద మరవకొమ్మ క్రాస్‌లో చెరువు నిర్మాణకర్త శ్రీరంగరాయుడు, రుషింగమయ్య విగ్రహాల ఏర్పాటుకు మంగళవారం శివపురం గ్రామస్థులు భూమిపూజ చేశారు. జాతీయ రహదారి పక్కన నిత్యాన్నదానం ఏర్పాటు కోసం కమిటీ సభ్యులు నిర్ణయించారు. మంగళవారం మరవకొమ్మ వద్ద భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సభ్యులు రాంచరణ్‌యాదవ్, తిరుపతయ్య, వెంకటనారాయణ, ప్రసాద్, బాలంజనేయులు పాల్గొన్నారు.

పాలకులూ.. పట్టించుకోండి..!

● అసంపూర్తిగా సచివాలయ భవనాలు
● కొన్నిచోట్ల అద్దె భవనాల్లో నిర్వహణ

ఉరవకొండ, జూలై 8(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో చేపట్టిన సచివాలయ భవన నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. కొన్ని శ్లాబుల, మరికొన్ని చివరి దశలో ఉన్నాయి. ఉరవకొండ, వజ్రకరూరు మండలాలకు మొత్తం 32 సచివాలయ భవనాలు మంజూరయ్యాయి. ఒక్కో దానికి రూ.40 లక్షలు చొప్పున కేటాయించారు. పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయకపోవడంతో వాటి నిర్మాణాలు ఆగిపోయాయి. నేటికీ ఆ భవనాలు అందుబాటులోకి రాకపోవడంతో సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇరుకు గదుల్లో సచివాలయాలను నిర్వహిస్తున్నారు. కేటాయించిన కుర్చీలు తదితర సామగ్రి పెట్టుకునేందుకు స్థలం కూడా లేక పోవడంతో వాటిని ఒక మూలన పడేశారు.



రాగులపాడు, యాడికిలో ఆగిన అంగన్‌వాడీ భవన నిర్మాణాలు

● ఉరవకొండలో 18 సచివాలయాలకు గాను 17 సచివాలయాలకు భవనాలను కేటాయించారు. అందులో ఎనిమిది భవనాల నిర్మాణాలు పూర్తికాగా ... తొమ్మిది సచివాలయ భవనాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. కొన్ని శ్లాబ్ దశలో, మరికొన్ని పునాది స్థాయిలోనే ఉన్నాయి. ఉరవకొండలో నాలుగు సచివాలయాలను సౌకర్యాలు లేని ఇరుకు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు.

● వజ్రకరూరు మండలంలో 14 సచివాలయాలకు భవనాలను మంజూరు చేయగా.. వాటిలో ఏడు భవనాలను పూర్తి చేశారు. రెండింటి నిర్మాణాలను ఇంకా ప్రారంభించలేదు. ఐదు చోట్ల భవన నిర్మాణాలు ఆగిపోయాయి. ఈ విషయంపై ఏఈ రవీంద్రను వివరణ కోరగా 80 శాతం పనులు పూర్తైన భవనాలు ప్రారంభించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. నిధుల లభ్యతను బట్టి పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

● యాడికి: యాడికిలోని నాగులకట్టవీధి, లాలాలవీధి, ఆంజనేయస్వామి కాలనీల్లో సుమారు రూ.28 లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను గత వైసీపీ ప్రభుత్వం ప్రారంభించింది. పైకప్పు పూర్తయ్యేంతవరకు ఈ పనులు కొనసాగినప్పటికీ.. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. దీంతో ఆ పనులు ఆగిపోయాయి. అంగన్‌వాడీ భవనాలు మొండిగోడలకే పరిమితమయ్యాయి. దీంతో అసౌకర్యాల నడుమ అంగన్‌వాడీ భవనాలను అద్దె గదుల్లో నిర్వహిస్తున్నారు. వీటిల్లో కనీసం మురుగుదొడ్లు, బాత్రూములు కూడా లేకపోవడంతో పిల్లలు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. కాగా, రాయలచెరువులోని ఒక అంగన్‌వాడీ భవన నిర్మాణం పూర్తయినా బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ ఆ భవనానికి తాళం వేశాడు. ఇలా ఏడేళ్ళ గడిచినా ఆ భవనాన్ని అధికారులు స్వాధీనం చేసుకోకపోవడం గమనార్హం. ఈ సమస్యలను పరిష్కరించడానికి పాలకులు, అధికారులు ఎవరూ చొరవచూపడం లేదు. దీనిపై ఐసీడీఎస్ సీడీపీఓ పాజిడాబేగంను వివరణ కోరగా.. బిల్లులు మంజూరుకాకపోవడంతో కాంట్రాక్టర్లు నిర్మాణ పనులను ఆపేశారని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లామని తెలిపారు. అద్దె భవనాల్లో వీలైనంతవరకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

పండ్లతోటల పెంపకాన్ని సద్వినియోగం చేసుకోండి




కరిడికొండలో మాట్లాడుతున్న ఎంపీ అంబిక, అవులదట్లలో మొక్కలు నాటుతున్న విప్ కాలవ, బ్రాహ్మణపల్లిలో మొక్క అందజేస్తున్న ఎమ్మెల్యే అశ్మితరెడ్డి

గుత్తి/రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉచితంగా ఉపాధి హామీ పథకం కింద పండ్లతోట పెంపకానికి అవకాశం కల్పించిందని, దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడుయాదవ్ సూచించారు. మంగళవారం మండలంలోని కరిడికొండలో ఉపాధి హామీ పథకం ద్వారా మామిడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. అనంతరం గుత్తి కోటలోని 12.13 ఎకరాల్లో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు ఈశ్వర్, వెంకటరాముడు, నరసింహులు, శ్రీనివాసచౌదరి, ప్రతాప్, టికెన్ శీనా సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.

● రాయదుర్గంరూరల్ : మండలంలోని ఆవులదట్లలో రైతులు శివానందనాయక్, శీనన్ననాయక్ పొలంలో నేరేడు మొక్కలు నాటి విప్ కాలవ శ్రీనివాసులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కురుబ హనుమంతు, కాటా వెంకటేశులు, ప్రసాద్, ఆంజనేయులు, సింగయ్యచౌదరి, వెంకటేష్‌నాయక్, వీరేష్‌స్వామి పాల్గొన్నారు.

● తాడిపత్రి: మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొక్కలను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 200 ఎకరాల్లో పండ్లతోటల్లో మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు.

● అలాగే కూడేరు మండలం కడదరకుంట గ్రామంలో రైతు ఓబుళకృష్ణ పొలంలో ఎంపీడీఓ కుళ్లాయిస్వామి మామిడి మొక్కలు నాటారు. బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూరు గ్రామంలోని రైతు వండ్రప్ప పొలంలో ఎంపీడీఓ విజయభాస్కర్ సపోట చెట్టు పెట్టించారు. ఉరవకొండ మండలంలోని పెద్ద ముష్టూరులో పండ్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంపీడీఓ రవిప్రసాద్, ఏపీఎంఐపీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం నిర్వహించారు. వజ్రకరూరు మండలంలో వెంకటాంపల్లిలో ఎంపీడీఓ శివాజిరెడ్డి, పెద్దవడుగూరులో ఏపీడీ విజయభారతి, పామిడిలో ఎంపీడీఓ తేజోత్స్న ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. బెళుగుప్ప మండలంలోని బ్రాహ్మణపల్లి తండా సమీపంలో రోడ్డు కిరువైపులా ఉపాధి హామీ పథకం ఏపీవో మురళి మొక్కలు నాటించారు.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి


యల్లనూరులో కార్యకర్తలతో మాట్లాడుతున్న శైలజానాథ్

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా యల్లనూరులోని ఆయన విగ్రహానికి వైసీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త శైలజానాథ్ మంగళవారం పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఇందులో మండల జడ్పీటీసీ భోగాతి ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ గంగాదేవి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే పుట్లూరు మండలంలోని పుట్లూరు, చెర్లోపల్లి, కడవకల్లు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో శైలజానాథ్ పాల్గొన్నారు. గుంతకల్లు పట్టణంలో వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భవాని, వైస్‌చైర్‌పర్సన్ నైరుతి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిలింగేశ్వరబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యాడికిలో నిర్వహించిన కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెంకట్రామిరెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీదేవి, మండల కన్వీనర్ సంజీవరాయుడు పాల్గొన్నారు. అలాగే గుత్తి, పామిడి, తాడిపత్రి తదితర ప్రాంతాల్లోనూ వైఎస్ఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

సాయిబాబా ప్రతిమ ఊరేగింపు

తాడిపత్రి, జూలై 8(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి పురస్కరించుకుని స్థానిక శ్రీ షిర్డీసాయిబాబా మందిరంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా ప్రతిమను పట్టణంలో ఊరేగించారు.


యాడికిలో ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న సభ్యులు

మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

యాడికి, జూలై 8(ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్లో గత విద్యా సంవత్సరం టెన్త్ ఫలితాల్లో మొదటిర్యాంక్ సాధించిన దేవేష్‌కు రూ.5వేలు, రెండో ర్యాంక్ సాధించిన విక్రమ్‌రెడ్డికి రూ.3వేలు, మూడో ర్యాంక్ సాధించిన తరుణికి రూ.2వేలను ప్రోత్సాహక బహుమతులుగా అందజేశారు. మంగళవారం ఆ పాఠశాలలో తెలుగు విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం సభ్యులు ఆ నగదు బహుమతులను అందజేశారు. పాఠశాలలో ప్రస్తుతం చేపడుతున్న భోజనశాల నిర్మాణానికి విశ్రాంత ఉపాధ్యాయ సంఘం సభ్యుడు చంద్రశేఖర్ రూ.25వేలు, ఇదే పాఠశాలలో పనిచేసిన గణిత ఉపాధ్యాయుడు అశ్వత్థరెడ్డి రూ.10వేలు అందజేస్తామని ప్రకటించారు.

● పామిడి: మండలంలోని ఆరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఆరుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున మొత్తం రూ.6 వేలను ఎంఈఓ జయనాయక్ ప్రోత్సాహక బహుమతులుగా అందజేశారు. అలాగే మండల టాపర్‌గా నిలిచిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి రూ.4వేలు అందజేశారు. ఈ నగదును ఆయన ఆయా పాఠశాలల హెచ్ఎంలకు మంగళవారం అందజేశారు.

ఎమ్మార్పీఎస్ కో కన్వీనర్‌గా రాజశేఖర్

ఉరవకొండ, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కో కన్వీనర్‌గా పొట్టాకు గ్రామానికి చెందిన ఎన్ రాజశేఖర్ ఎన్నికయ్యారు. జిల్లా ఇన్‌చార్జ్ చిన్నసుబ్బారాయుడు, జిల్లా కన్వీనర్ హరి గోపాల్ ఆధ్వర్యంలో తనను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

టీడీపీతోనే అభివృద్ధి

గుంతకల్లు, జూలై 8(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే పాలనతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. మంగళవారం పట్టణంలోని 23వ వార్డులో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు.

● యల్లనూరు : మండలకేంద్రంలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ పథకాలను వివరించారు.

● రాయదుర్గం/డీ.హీరేహాళ్ : రాయదుర్గంలోని 19వ వార్డు, డీ.హీరేహాళ్ మండలంలోని కలాలూరులో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని విప్ కాలవ శ్రీనివాసులు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను, టీడీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు.



గుంతకల్లు, యల్లనూరులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యేలు గుమ్మనూరు, బండారు శ్రావణిశ్రీ

ముగిసిన మొహర్రం

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: కూడేరు మండలంలోని మొహర్రం వేడుకలు మంగళవారంతో ముగిశాయి. ఇప్పేరు, కడదరకుంట, బోసమద్రం, కూడేరు, కొర్రకోడు, గొట్కూరు, కమ్మూరు, జల్లిపల్లి గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. గుత్తి మండలంలోని గొందిపల్లి, జక్కలచెరువు, ఇసురాళ్లపల్లి, పెదొడ్డి, తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు ముగిశాయి. సాయంత్రం జలధి కార్యక్రమం నిర్వహించారు. కణేకల్లులోని పాత పోలిస్‌స్టేషన్ వద్ద శ్రీకాలాబాయి పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామపురవీధులలో కాలాబాయి పీర్లను ఊరేగించగా వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. రాయదుర్గం మండలంలోని వేపరాల, కెంచానపల్లి గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. సాయంత్రం జలధి కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే బెళుగుప్ప, గుమ్మఘట్ట మండలాల్లో జలధి కార్యక్రమాన్ని నిర్వహించారు.




కూడేరు, గుత్తి మండలం గొందిపల్లిలో జలధికి వెళ్తున్న పీర్లు, కణేకల్లులో ఊరేగుతున్న కాలాబాయి పీరు

న్యూస్ బాక్స్

నీటి సమస్యను పరిష్కరించండి


నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

ఉరవకొండ, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెరిమెట్ల గ్రామంలోని తమ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మహిళలు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. సచివాలయం నుంచి మల్లేశ్వరి ఇంటి వరకు పైప్‌లైన్ వేసినా నీళ్లు రావడం లేదని వాపోయారు. తమ కాలనీలో 50 దాకా ఇళ్లు ఉన్నాయని, నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.

దరఖాస్తులపై విచారణ

యాడికి, జూలై 8(ఆంధ్రజ్యోతి): యాడికిలో గత నెల 16న నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు మంగళవారం విచారించారు. జనసేన మండల కన్వీనర్ సునీల్‌కుమార్ యాడికిలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటు, యాడికి కాలువకు నీటి విడుదల, యాడికిలో బస్టాండ్ నిర్మాణం తదితర సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అర్జీదారుడుని పిలిపించి విచారించారు. దీనిపై ప్రత్యేక నివేదికను తయారు చేసి కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ వీరారాజు, తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

15 వరకు వాతావరణ బీమాకు గడువు

గుంతకల్లు టౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): పంటలకు వాతావరణ ఆధారిత బీమాకు ఈనెల 15 వరకు గడువు ఉందని, రైతులందరూ అంతలోపు ప్రీమియం చెల్లించి సద్వినియోగం చేసుకోవాలని ఉరవకొండ ఏడీఏ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని దంచెర్ల, పాతకొత్తచెరువు గ్రామాల్లో ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. తక్కువ పెట్టుబడి ఎక్కువ ఆదాయం అందించే కొత్తరకం ఆముదం రకం ఐసీహెచ్-5 రైతులు వేసుకోవాలని సూచించారు. ఇందులో వ్యవసాయ అధికారి లీనా వసుంధర, వీఏఏ అఖిల్ బ్రహ్మ, వీహెచ్ఏలు గౌని యా, విజయ్ కుమార్, వీఆర్వో మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీ పనుల పరిశీలన

కణేకల్లు, జూలై 8(ఆంధ్రజ్యోతి): కణేకల్లు హెచ్చెల్సీ సబ్ డివిజన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతు పనులను హెచ్చెల్సీ డీఈ దివాకర్‌రెడ్డి, ఏఈ నరేంద్రమూర్తి మంగళవారం పరిశీలించారు. తుంగభద్ర డ్యాంలో నీరు నిండుగా ఉండడంతో హెచ్చెల్సీకి త్వరలోనే నీటిని విడుదల చేసే అవకాశమున్నారు. అలాగే రూ. 35 కోట్లతో చేస్తున్న మరమ్మతు పనులు పలు చోట్ల పూర్తి కావచ్చాయని, హెచ్చెల్సీ కాలువకు నీరు విడుదలయ్యేలోపు పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.

ఎన్‌సీసీ శిక్షణకు విద్యార్థుల ఎంపిక

పామిడి, జూలై 8(ఆంధ్రజ్యోతి): స్థానిక టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎన్‌సీసీ శిక్షణకు విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఎన్‌సీసీ అధికారి రామాంజనేయులు తెలిపారు. 2025-2026 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంపిక చేశామని, దీనికి ఆంధ్ర బెటాలియన్ హవల్దార్ కైలాష్ తన సిబ్బందితో కలిసి ఈ ఎంపిక చేపట్టారన్నారు. బాలికలలో 17మంది, బాలురలో 32మంది ఎంపిక చేశారని, వీరికి ఎన్‌సీసీ శిక్షణ ఇస్తామని అన్నారు.

కులవృత్తుల వారికి రుణాలు ఇవ్వాలి

బొమ్మనహాళ్, జూలై 8(ఆంధ్రజ్యోతి): కులవృత్తుల వారికి ప్రభుత్వం బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేయాలని కులవృత్తుల సంఘం మండల ఇన్‌చార్జి తిప్పేస్వామి కోరారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో ఆర్‌ఐ బాలకృష్ణకు వినతి పత్రం అందించారు. 50 సంవత్సరాలు పైబడిన వారికి పెన్షన్లు మంజూరు చేయాలని, రూ.2 లక్షలకు తగ్గకుండా సబ్సిడీ రుణాలు ఇప్పించాలని కోరారు. ఇందులో కుల సంఘాల నాయకులు తేజ, చంద్రశేఖర్, శంకర్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

గుంతకల్లు టౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ రాజేంద్రప్రసాద్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని 600 మంది విద్యార్థులకు రూ. 45 వేలు విలువ చేసే ప్లేట్లను ఆర్యవైశ్య సంఘం నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. ఇందులో ఆ సంఘం అధ్యక్షుడు గోపా జగదీష్, కార్యదర్శి కృపాకర్, కోశాధికారి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు వేల్పూరి ప్రభాకర్, డీఈవీఎస్ సుబ్రహ్మణ్యం, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హంస వాహనంపై విరోబస్వామి



పామిడి, జూలై 8(ఆంధ్రజ్యోతి): స్థానిక విరోబస్వాముల బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామి వారిని హంస వాహనంపై ఊరేగించారు. పట్టణ పురవీధుల గుండా డిండి భజనలు చేస్తూ పాండురంగస్వామి ఉత్సవ మూర్తి గీతాలాపనలతో ఈ ఊరేగింపు కొనసాగింది.

కసాపురంలో ఆంజనేయస్వామి ప్రాకారోత్సవం


స్వామివారి ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

గుంతకల్లుటౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో ఆంజనేయస్వామి ప్రాకారోత్సవాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. అర్చకులు రాత్రి వెండి రథంలో స్వామి వారి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి.. మేళతాళాల మధ్య ఆలయ ఆవరణంలో ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు.

ఆశ్రమంపై చర్యలు తీసుకుంటాం

కూడేరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): 'కూడేరు మండలం గొట్కూరు గ్రామం వద్దనున్న బెరారా అనాథ ఆశ్రమానికి ప్రభుత్వం ఎటువంటి భూమినీ కేటాయించలేదు. ఆశ్రమానికి ప్రభుత్వం స్థలాన్ని కేటాయించినట్లు దాని నిర్వాహకుడు శ్రీరాములు అసత్య ప్రచారాలు చేస్తున్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వాహకుడికి నోటీసులు ఇచ్చినా ఎటువంటి సమాధానమూ ఇవ్వలేదు. దీంతో ప్రభుత్వ భూమిని ఆక్రమించినందుకు చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం' అని తహసీల్దార్ మహబూబ్‌బాషా స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన సీవరాజుతో కలిసి మీడియాతో మాట్లాడారు. శ్రీరాములు ఆ ఆశ్రమం పక్కనే ఉన్న వెత్తలో సంపద కేంద్రం స్థలాన్ని.. చాకిరేవు స్థలాన్ని ఆక్రమించుకున్నట్లు గుర్తించామన్నారు.

పల్లెవనం ఏర్పాటుకు భూమిపూజ

బెళుగుప్ప, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తగ్గుపర్తి గ్రామంలో పల్లెవనం ఏర్పాటుకు ఈడీఆర్ శివరంజని, సెక్రెటరీ శంకరయ్య, ఎపీఓ వన్నూరుస్వామి, టీడీపీ నాయకులు రాధాకృష్ణ, జయరాములు, వెంకటనాయుడు, రఘురాములు మంగళవారం భూమిపూజ చేశారు. పంచాయతీ నిధులు రూ.పది లక్షలతో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు వారు తెలిపారు.

క్రైం న్యూస్..

పెద్దారెడ్డికి నోటీసులు

యల్లనూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి మంగళవారం ఉదయం పోలీసు అధికారులు నోటీసులు అందజేశారు. వైఎస్ఆర్ జయంతి వేడుకలకు తాడిపత్రికి వెళ్లరాదంటూ సీఆర్పీసీ 151కింద ఈ నోటీసును సీఐలు సత్యబాబు, శేఖర్‌లు అందించారు.

మైలాపురం ఘర్షణలో ఇరువర్గాలపై కేసు


కొళగానహళ్లి గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ

బొమ్మనహాళ్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలాపురం గ్రామంలోని సోమవారం రాత్రి జరిగిన ఘర్షణ సంబంధించి ఇరువర్గాలపై పోలీసులు మంగళవారం కేసులు నమోదు చేశారు. మండలంలోని కొళగానహళ్లి గ్రామానికి చెందిన అనంతరాజు బంధువులు మైలాపురం గ్రామంలోని విజయ్‌కుమార్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన విషయం తెల్సిందే. మంగళవారం కొళగానహళ్లి, మైలాపురం గ్రామాల్లో డీఎస్పీ రవిబాబు, రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, బొమ్మనహాళ్, కణేకల్లు, డీ. హీరేహాళ్ ఎస్‌ఐలు నితీష్ రసూల్, నాగనాయుడు, గురుప్రసాద్‌రెడ్డి పర్యటించారు. దాడిపై విచారించారు. తమకు దాదాపు రూ.4 లక్షలు ఆస్తి నష్టం కలిగిందని విజయకుమార్ కుటుంబ సభ్యులు డీఎస్పీకి తెలిపారు. అనంతరాజుపై దాడి చేసిన విజయకుమార్‌రెడ్డి, లోకేష్‌రెడ్డిలపై హత్యాయత్నం కేసు, అలాగే విజయ్‌కుమార్‌రెడ్డి ఇంటికి వెళ్లి దాడి చేసిన అనంతరాజు, ఆయన కొడుకులు, బంధువులు దాదాపు 38 మందిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నారన్నారు.

దుకాణంలో అగ్ని ప్రమాదం

ఉరవకొండ, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నముష్టూరు బీసీ కాలనీలోని ఓ కిరాణాదుకాణంలో సోమవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి.. వస్తువులన్నీ కాలిపోయాయి. ఆ షాపు నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు.. ఆ మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే షాపులోని సరుకులన్నీ కాలిపోయాయి. తనకు రూ.2 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు రమేష్ తెలిపారు.

ఇద్దరిపై దాడి

గుంతకల్లుటౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం గ్రామంలో సోమవారం రాత్రి జాతరకు వెళ్తే సమయంలో యువకుల మధ్య ఘర్షణ జరిగింది. విడిపించడానికి వెళ్లిన ఆంజనేయులు గౌడ్, నాగరాజు గౌడ్‌లపై అదే గ్రామానికి చెందిన కుమార్, బొజ్జయ్య, అనిల్, ఆనంద్ దాడి చేశారు. గాయపడిన ఆంజనేయులుగౌడ్, నాగరాజు గౌడ్‌ను గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇంటి నిర్మాణం కూల్చివేత

తాడిపత్రి, జూలై 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏటిగడ్డపాలెంలో వైసీపీ నాయకుడు అయూబ్‌బాషా తన కూతురు ఆఫ్రీన్‌కు సంబంధించిన మూడు సెంట్లలో జీ+3 ఇంటి నిర్మాణం కోసం అనుమతి తీసుకున్నారు. 3.75 సెంట్లలో నిర్మాణాలు చేపడుతున్నట్లు మున్సిపల్ అధికారులు గుర్తించారు. మంగళవారం అనుమతిలేని స్థలంలో నిర్మిస్తున్న నిర్మాణాలను కూల్చివేశారు.

రెండు ఇళ్లలో చోరీ


గుత్తి, జూలై 8(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని చెర్లోపల్లిలోని జగనన్న కాలనీలో పట్టపగలే రెండు ఇళ్లలో చోరీ జరిగింది. ఐదు తులాల వెండి ఆభరణాలు, రూ.25 వేలు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకొని వెళ్లినట్లు బాధితులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. జగనన్న కాలనీలో నివాసముంటున్న అంగన్‌వాడీ వర్కర్ సునీత విధులకు వెళ్లగా.. దుండగులు ఇంటి తాళాలను పగలగొట్టి బీరువాలో ఉన్న ఐదు తులాల వెండి పట్టీలు, రూ.5వేలు ఎత్తుకెళ్లారు. అదే కాలనీలో ప్రసాద్ అనే వ్యక్తి ఇంటి తాళాలను పగలగొట్టి రూ.20వేలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు.

సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుపై అభిప్రాయ సేకరణ


మాట్లాడుతున్న తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ

కళ్యాణదుర్గం, జూలై 8(ఆంధ్రజ్యోతి): కుందుర్పి, చెన్నంపల్లి పరిసర ప్రాంతాల్లో సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుపై కుందుర్పిలోని గ్రామ సచివాలయం-1లో మంగళవారం రైతుల అభిప్రాయ సేకరణ చేపట్టారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అమిలినేని లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కృషి వల్లే సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటు సాధ్యమైందన్నారు. 30 ఏళ్ల పాటు మీ ప్రాంత భూములను రైతుల పూర్తిమద్దతుతోనే లీజు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎకరాకు సంవత్సరానికి రూ. 30 వేలు చొప్పున సోలార్ కంపెనీలు చెల్లిస్తాయన్నారు. ఆసక్తి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వసంతబాబు, తహసీల్దార్ బాలకిషన్, మాజీ సర్పంచు గాజుల శ్రీరాములు, మాజీ వైఎస్ ఎంపీపీ తలారి ఎర్రిస్వామి, ఏపీఏస్‌హెచ్‌సీఎల్ నెడ్ క్యాప్ కంపెనీ ప్రతినిధులు, రైతులు, వీఆర్వోలు, గ్రామ సచివాలయ సిబ్బంది, సర్వేయర్లు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ


నోటుపుస్తకాలను అందజేస్తున్న ఎంఈఓలు, నాయకులు

గుంతకల్లు టౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏపీయాడ్ బ్యాంక్ కార్యాలయంలో అమ్మదీవెన ట్రస్ట్ సౌజన్యంతో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత నోట్ పుస్తకాలను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో అమ్మదీవెన ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు టీ దొడ్డప్ప, ఎంఈఓలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు, ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షుడు జీవీ రవి, పట్టణ కార్యదర్శి వెంకటరాముడు, ఎలక్ట్రానిక్ అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి శివారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

చేతివృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

తాడిపత్రి, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద చేతివృత్తిదారులు సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా మంగళవారం నిర్వహించారు. వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి బీసీ, ఫైనాన్షియల్ కార్పొరేషన్ ద్వారా రూ.2 లక్షల సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, ఇంటిస్థలాలు ఇవ్వాలని, 50 సంవత్సరాలు నిండిన చేతి వృత్తిదారులకు పెన్షన్ అందజేయాలని కోరారు. ఇందులో పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్, నాయకులు నాగేంద్ర, అబ్రహాం, శ్రీనివాసులు, రత్నమయ్య, నాగార్జున, బాబయ్య పాల్గొన్నారు.